www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
22.02.2024
సంపుటి:2 సంచిక:132

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



# మహా జాతర షురూ

- మేడారం వనమంతా జనహోరు
- జనసంద్రమైన జంపన్నవాగు
- శివసత్తుల పూనకాలు, బంగారం మొక్కులు
- తల్లుల శరణుఘోషలతో మార్మోగిన మేడారం
- గద్దెలపైకి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు
- నేడు గద్దె పైకి వరాల తల్లి సమ్మక్క రాక



ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళగా పిలిచే.. మేడారం మహా జాతర షురూ అయ్యింది. శివసత్తుల పూనకాలు, పొర్లు దండాలు, బెల్లం ఘుమఘుమలు, బంగారం మొక్కులు.. వెరిసి గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే వనదేవతల పండుగ కీలక ఘట్టం మొదలైంది. బుధవారం వనంలోని దేవతలు.. జనంలోకి రావడంతో జంపన్నవాగు జనసంద్రమైంది. కీకారణ్యం.. జనారణ్యమై కోలాహలంగా మారింది. భక్తుల భావోద్వేగం కట్టలు తెంచుకుంది. సల్లంగా సూడు తల్లీ అంటూ శరణు ఘోషలతో మేడారం పరిసరాలు మార్మోగాయి. డప్పు వాద్యాలు, సంప్రదాయ నృత్యాల మధ్య సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకున్నారు. ఇలవేల్పులైన తల్లులకు భక్తులు జంపన్న వాగులో పవిత్ర స్నానాలాచరించి నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ సమర్పిస్తున్నారు. శివసత్తులు, ఒడిబియ్యం, చీరె సారెలతో తల్లుల ముందు ప్రణమిల్లుతున్నారు.

– విశాల భారతి, స్టేట్‌బ్యూరో



## కిషన్ రెడ్డీ.. టచ్ చేసి చూడు ..
# నామరూపాల్లేకుండా చేస్తం

- రాష్ట్రానికి రూ. 200 కోట్లు తేలేనోడు కేంద్రమంత్రి..
- గత ప్రభుత్వం చేతగాని తనంతో.. ట్రిపుల్ఆర్ పని ఆగిపోయింది
- ప్రధాని మోదీని ఇక్కడ తిడతారు.. అక్కడ కాళ్లు పట్టుకుంటారు..
- రెండు మూడు రోజుల్లో మరో రెండు హామీలు అమలు
- బీజేపీ, బీఆర్ఎస్‌లపై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

మిగతా 2 లో

## ప్రపంచంతో పోటీ పడేలా..
# తెలంగాణను తీర్చిదిద్దుతాం

- పారిశ్రామిక వేత్తలకు అండగా ఉంటాం
- పక్కాగా తెలంగాణ భవిష్యత్ కు ప్రణాళికలు
- పూర్తి స్థాయిలో డెవలప్‌మెంట్ మీదే ఫోకస్
- జహీరాబాద్‌లో నిమ్స్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఓఆర్ఆర్, ట్రిపుల్ఆర్ మధ్యలో డ్రైపోర్టులు
- ఫార్మా విలేజీలు పూర్తి స్థాయిలో డెవలప్‌చేస్తం
- 'సీఐఐ' నిర్వహించిన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హోటల్ వెస్టిన్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో 'విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక అవకాశాలు' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో సీఐఐ తో కలిసి ముందుకు నడుస్తాం.. ఇందులో భాగంగా 64 ఐటీఐలను స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లుగా రూ.2,000 కోట్లతో డెవలప్ చేయబోతున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. స్కిల్లింగ్ యూనివర్సిటీల ఏర్పాటు కోసం సంప్రదింపులు రుపుతున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జాయిన్ అయిన స్టూడెంట్లకు డిగ్రీ సర్టిఫికెట్స్ ఇవ్వబోతున్నామని వెల్లడించారు. తెలంగాణలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తున్నామని.. గతంలో అవుటర్ రింగ్ రోడ్డు అవసరం లేదని కొందరు అన్నారు. ఇప్పుడది హైదరాబాద్ కు లైఫ్ లైన్ గా మారిందని సీఐఐ సదస్సులో సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ పడాలన్నదే మా విధానం. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటాం. అభివృద్ధి విషయంలో మా ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవు. అభివృద్ధి కోసం గత పాలకులు

మిగతా 2 లో



లిక్కర్ స్కామ్ కేసులో కవితకు
# సీబీఐ నోటీసులు

- కవిత రియాక్షన్ ఏంటి?
- గతంలో పలు మార్లు దుమ్మా
- పార్లమెంటు ఎన్నికల వేళ కీలక పరిణామం

మిగతా 2 లో



## జగజ్యోతికి
# 14 రోజుల రిమాండ్

- ఉస్మానియా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్
- ఏసీబీ న్యాయస్థానం హాజరుపర్చిన అధికారులు
- రిజెక్ట్ చేయాలని జ్యోతి న్యాయవాది వాదనలు
- మార్చ్ 6 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పు

మిగతా 2 లో

# మార్చి రెండో వారంలో కేంద్ర కేబినెట్

- లోక్ సభ ఎన్నికలపైనే ప్రధాన చర్చ . .
- కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మార్చి రెండో వారంలో షెడ్యూల్ ప్రకటించే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మార్చి 3న కేంద్ర మంత్రిమండలి సమావేశం కానుంది. దిల్లీ చాణక్యపురిలోని సుష్మాస్వరాజ్ భవన్‌లో ఈ భేటీ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు కొన్ని రోజుల



మిగతా 2 లో

## రైతులపై రబ్బర్ బుల్లెట్లు..
# టియర్ గ్యాస్!

- ఓ యువరైతు కరణ్‌సింగ్ మృతి
- చర్చలకు ఆహ్వానించిన కేంద్ర మంత్రి
- డిమాండ్ల పరిష్కారానికి రెడీ అంటూ ప్రకటన
- రైతులకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ

మిగతా 2 లో





# ప్రపంచంతో పోటీ పడేలా.. తెలంగాణను తీర్చిదిద్దుతాం

మొదటిపేజీ తరువాయి

తీసుకున్న మంచి నిర్ణయాలను కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో భాగంగానే ఇటీవల కేంద్ర మంత్రులతో భేటీ అయినట్లు చెప్పారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలకు అండగా ఉంటుందని రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. అపారమైన అనుభవం కలిగిన పారిశ్రామిక వేత్తలు అనుభవాన్ని రంగరించి తెలంగాణ అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 2050 నాటికి మాస్టర్‌ప్లాన్‌ఫర్‌తెలంగాణ తయారు చేస్తున్నామని రాష్ట్రం మొత్తం సింగిల్‌యూనిట్‌గా ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ ప్రయత్నమన్నారు. ఇంజినీరింగ్‌చదివిన వాళ్లు కూడా రూ. 15 వేల శాలరీకి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, స్కిల్ విషయంలో ఎక్కడో గ్యాప్ ఉన్నట్లు భావిస్తున్నానని, దానిని ఫుల్‌ఫిల్‌చేయాలన్నారు.

**'ఆ నిర్ణయంతోనే ఫార్మా రంగం వృద్ధి'**

ఇందిరాగాంధీ విధానపరమైన నిర్ణయం తీసుకుని ఐడీపీఎల్ ను ప్రారంభించినందునే ఫార్మా రంగంలో హైదరాబాద్ మెరుగైన స్థితిలో ఉందని గుర్తు చేశారు. పాలకుల నిర్ణయాలు, విధానాలు రాష్ట్ర ఆర్థిక పురోగతికి తోడ్పడుతాయని చెప్పారు. ఐటీఐల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం టాటా సంస్థతో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు.

# మార్చి రెండో వారంలో కేంద్ర కేబినెట్

మొదటిపేజీ తరువాయి

ముందే కేంద్ర మంత్రిమండలి భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లో పర్యటించి.. ఎన్నికల సంసిద్ధతను పర్యవేక్షిస్తోంది. మరోవైపు, 2014 లోక్‌సభ ఎన్నికలను తొమ్మిది విడతల్లో నిర్వహించారు. మార్చి 5న ఎన్నికల ప్రక్రియ మొదలై మే 16న ఫలితాలు వెలువడ్డాయి. 2019లో మాత్రం ఏడు విడతల్లో నిర్వహించారు. మార్చి 10న ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగా మే 23న ఫలితాలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మార్చి 9 తర్వాత ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం శాసనసభలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సిఉంది. వీటితోపాటు జమ్మూకశ్మీర్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఈసీ భావిస్తోంది

# లిక్కర్ స్కామ్ కేసులో కవితకు సీబీఐ నోటీసులు

- **కవిత రియాక్షన్ ఏంటి?**
- **గతంలో పలు మార్లు డుమ్మా**
- **పార్లమెంటు ఎన్నికల వేళ కీలక పరిణామం**

విశాలభారతి,స్టేట్ బ్యూరో:



బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నోటీసులు జారీ చేసింది. గతంలో సీబీఐ కవిత నివాసం వద్ద స్టేట్‌మెంట్ తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆమె ఈ నెల 26న విచారణకు హాజరు కావాలని సీబీఐ నోటిసుల్లో ఆదేశించింది.
లిక్కర్ కేసులో కల్వకుంట్ల కవితను సీబీఐ అధికారులు గతంలో ఆమె ఇంటి దగ్గర విచారణ చేశారు. తాజాగా మళ్లీ సీబీఐ నోటీసులు ఇవ్వటంతో ఈ లిక్కర్ కేసులో కదలిక వచ్చింది. గతంలో ఈడీ పంపిన నోటీసులకు కూడా ఎమ్మెల్సీ కవిత హాజరుకావడం లేదు. తాజాగా సీబీఐ నోటీసులపై కవిత ఎలా స్పందిస్తారన్నది ఆసక్తిగా మారింది. లిక్కర్ స్కామ్ కేసులో కల్వకుంట్ల కవిత ఈడీపై వేసిన పిటిషన్ ఫిబ్రవరి 16న సుప్రీం కోర్టులో విచారణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 28కి వాయిదా వేసింది. లిక్కర్ కేసులో ఈడీ ఇచ్చిన నోటీసులను కవిత గతేడాది సుప్రీంకోర్టులో సవాలు చేసిన సంగతి తెలిసిందే. తనపై ఈడీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని కవిత సుప్రీం కోర్టును కోరారు. ఈ పిటిషన్ ను పరిశీలించిన జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ల బెంచ్ దీన్ని విచారణ చేసింది. సుప్రీంకోర్టులో మహిళల ఈడీ విచారణ కేసు విచారణ పెండింగ్ లో ఉండటం వల్ల లిక్కర్ కేసులో ఈడీ నోటీసులు ఇస్తున్నప్పటికీ కవిత గైర్హాజరవుతున్నారు.

# జగజ్యోతికి 14 రోజుల రిమాండ్



- **ఉస్మానియా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్**
- **ఏసీబీ న్యాయస్థానం హాజరుపర్చిన అధికారులు**
- **రిజెక్ట్ చేయాలని జ్యోతి న్యాయవాది వాదనలు**
- **మార్చ్ 6 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పు**

విశాలభారతి,స్టేట్ బ్యూరో:

ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి జ్యోతి రెండు రోజుల డ్రామాకు తెర పడింది. కాసేపటి క్రితమే జ్యోతిని ఉస్మానియా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు జ్యోతి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. అయితే ఆరోగ్యం బాగోలేదంటూ లేడీ ఆఫీసర్ ఆసుపత్రిలో చేరారు. ఏసీబీకి పట్టుబడిన వెంటనే అస్వస్థత పేరు చెప్పి జ్యోతి ఆస్పత్రిలో చేరారు. చికిత్స కోసం జ్యోతిని ఉస్మానియా ఆస్పత్రికి ఏసీబీ అధికారులు తరలించారు. జ్యోతి ఆరోగ్యంగా ఉందంటూ ఉస్మానియా వైద్యులు ఈరోజు (బుధవారం) డిశ్చార్జ్ చేశారు.

ఏసీబీ కోర్టుకు.. 14 రోజుల రిమాండ్

ఆ వెంటనే లేడీ అధికారిణిని ఏసీబీ న్యాయస్థానం ముందు అధికారులు హాజరుపర్చారు. అయితే 24 గంటలు దాటిన మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చలేదు కాబట్టి రిమాండ్ రిజెక్ట్ చేయాలని జ్యోతి తరుపు న్యాయవాది వాదించారు. జ్యోతికి అనారోగ్య సమస్య కారణంగా హాస్పిటల్‌లో అడ్మిట్ చేశామని కోర్టుకు ఏసీబీ చెప్పింది. అరెస్ట్ చూపించిన 24 గంటలకు ఎందుకు రిమాండ్ చేయలేదని కోర్ట్ ప్రశ్నించగా... హాస్పిటల్‌లో ఉన్న కారణంగా రిమాండ్ చేయలేదని నిన్న మెమో దాఖలు చేసినట్టు కోర్ట్‌కు ఏసీబీ తెలిపింది. దీంతో జ్యోతికి ఏసీబీ కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. మార్చ్ 6 వరకు జ్యోతికి కోర్టు రిమాండ్ విధించింది. కాగా, దాదాపు రూ.84వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు జ్యోతి పట్టుబడగా.. ఆ తరువాత ఆమె నివాసంలో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు విస్తుపోయారు. జ్యోతి ఇంట్లో 3.6 కేజీల బంగారం, 65 లక్షల నగదు, వ్యవసాయ భూమి పత్రాలు, ఓ పెన్ ఫ్లాట్స్ పాత్రలను ఏసీబీ సీజ్ చేసింది. జ్యోతిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును ఏసీబీ నమోదు చేయనుంది. జ్యోతి ఆస్తులు మరికొన్ని బీనామీలపై ఉన్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది.



విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

# కిషన్ రెడ్డీ.. టచ్ చేసి చూడు .. నామరూపాల్లేకుండా చేస్తం

బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్ అయ్యారు. ప్రభుత్వాన్ని పడగొడ్తమన్నట్లు కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. 'టచ్ చేసి చూడు'.. నామరూపాల్లేకుండా చేస్తాం' అని హెచ్చరించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నిన్నటి ఢిల్లీ పర్యటన వివరాలను తెలియజేశారు. భువనగిరి ఖిల్లా మీద రోప్ వేసుకుందామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని రూ. 200 కోట్లు అడిగితే కనీసం స్పందించలేదన్నారు. నాలుగేండ్ల నుంచి ఫైల్ దగ్గర పెట్టుకొని సొంత రాష్ట్రానికి కనీసం రూ. 200 కోట్లు తేలేని మంత్రి కిషన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు.
ఢిల్లీ పర్యటన సక్సెస్‌అయ్యిందని తెలంగాణ రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) కు నిధులు కేటాయిస్తానని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు రోడ్ల భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ పూర్తి అయితే హైదరాబాద్‌తో పాటు తెలంగాణ 50 శాతం కవర్ అవుతుందని.. హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. రైల్వే ప్రాజెక్టుకు కూడా హామీ ఇచ్చారని.. ఇక పనులు మొదలవుతాయని తెలిపారు. నల్గొండ రింగ్ రోడ్డుకు రూ.700కోట్లు ఇస్తామని అన్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు మోడీని ఇక్కడ తిడతారు అక్కడ కాళ్లు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు.
కేబినెట్ లో ఉంటూ కనీసం రూ. 200 కోట్ల నిధులు ఇవ్వలేక పోయారని, తాము వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ. 3 వేల కోట్ల పనులు తెచ్చుకున్నామన్నారు. అభివృద్ధి పనుల కోసం అవసరమైతే ప్రధాన మంత్రిని కూడా కలుస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాలేదని అన్నారు. రెండు మూడు రోజుల్లో మరో రెండు హామీలను అమలు చేయబోతున్నామని చెప్పారు. ఎన్నికలకు ముందు మోదీ మాట్లాడిన స్పీచ్ ఆడియోలు తన వద్ద ఉన్నాయని, 20 కోట్ల ఉద్యోగాలిస్తానన్న ప్రధాని ఇచ్చారా..? అని ప్రశ్నించారు. బ్లాక్ మనీ తెస్తానన్నప్రధాని తెచ్చారా..? ఓ వైపు ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తుంటే పట్టించుకోవడం లేదన్నారు. రూ. 500 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ. 1200 చేరిందని అన్నారు. నమామి గంగాకు కేంద్రం రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసిందని, హైదరాబాద్ లోని మూసీకి నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేసుల నుంచి తప్పించుకునేందుకే బీఆర్‌ఎస్, బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకుందని విమర్శించారు. అందులో భాగంగానే కేసీఆర్ ఢిల్లీ వెళుతున్నారని అన్నారు. శత్రువైన మోదీ దగ్గరికి కేసీఆర్ వెళ్లిన కేటీఆర్ ను ఆశీర్వదించండి అని అడిగారంటే ఇద్దరి మధ్య దోస్తానా కుదిరినట్టేనన్నారు.
బీఆర్‌ఎస్ నేతల పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేంద్రం నుంచి నిధులను తీసుకోవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. గత ప్రభుత్వం చేతగానితనంతో ట్రిపుల్‌ఆర్‌పని ఆగిపోయిందన్నారు. ఢిల్లీ పర్యటనలో చాలా అభివృద్ధి పనులకు.. నిధులు మంజూరు చేయించుకున్నామని చెప్పారు. రూ.700 కోట్లతో నల్గొండ బైపాస్ రోడ్డును కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేశారని చెప్పారు. ఇందుకు ఆయనకు ధన్యావాదాలని అన్నారు. వారంలో భూమి సేకరించి టెండర్లు పిలుస్తామని చెప్పారని వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి పిచ్చి మాటలు మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే నామరూపాలు లేకుండా చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

# రైతులపై రబ్బర్ బుల్లెట్లు.. టియర్ గ్యాస్!

- **ఓ యువరైతు కరణ్‌సింగ్ మృతి**
- **చర్చలకు ఆహ్వానించిన కేంద్ర మంత్రి**
- **డిమాండ్ల పరిష్కారానికి రెడీ అంటూ ప్రకటన**
- **రైతులకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ**

విశాల భారతి, నేషనల్‌బ్యూరో:

తమ తీరని డిమాండ్ల సాధనతో ఢిల్లీ వైపు సాగిన రైతుల' ఢిల్లీ చలో' ఆందోళన బుధవారం తీవ్రస్థాయి ఉద్రిక్తతల నడుమ ఆరంభమైంది. హర్యానా సరిహద్దులలో కనౌరీ వద్ద హర్యానా భద్రతాబలగాలకు రైతులకు జరిగిన ఘర్షణలో ఓ 21 సంవత్సరాల రైతు శుభ్‌కరణ్ సింగ్ మృతి చెందాడు. ఈ ప్రాంతంలోనే పరిస్థితి పూర్తిగా చేయిదాటి రణరంగాన్ని తలపించింది. పంజాబ్ నుంచి తరలివచ్చిన రైతులను హర్యానా సరిహద్దుల్లోని శంభు, కనౌరీ వద్ద పోలీసులు, భద్రతా బలగాలు అటకాయించారు. దీనిని రైతులు ప్రతిఘటించారు. ముందుకు సాగేందుకు యత్నించారు. దీనితో వీరిని చెదరగొట్టేందుకు హర్యానా పోలీసులు వారిపై భాష్పవాయువు ప్రయోగించారు. పలు భద్రతా వలయాలను ఛేదించుకుంటూ, బారికేడ్లను తీసివేస్తూ రైతులు ముందుకు సాగడంతో అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు రణరంగం అయింది. వీరిని నిలువరించేందుకు మధ్యాహ్నానికి మూడు సార్లు భాష్పవాయువు ప్రయోగించారు.ఇక్కడనే టియర్‌గ్యాస్ ప్రయోగానికి డ్రోన్లను కూడా వాడారు. దీనితో రైతులు భాష్ప వాయువు నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయాల్సి వచ్చింది. కనౌరిలో కూడా పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. రైతులను చెదరగొట్టారు. ఈ ప్రాంతం పూర్తిగా ఉద్రిక్తంగా మారింది. ముందుకు వెళ్లుతున్న రైతులు, అక్కడి హర్యానా పోలీసు, భద్రతా బలగాల నడుమ దాదాపుగా సంకుల సమరం జరిగింది. ఘర్షణల నడుమ తీవ్రంగా గాయపడ్డ ముగ్గురు రైతులలో ఒక్క రైతు శుభ్‌కరణ్‌సింగ్ అప్పటికే చనిపోయి ఉన్నాడని పాటియాలలోని రాజేంద్ర ఆసుపత్రి ఉన్నతాధికారి హెచ్‌ఎస్ రేఖీ విలేకరులకు తెలిపారు. కనౌరీ సరిహద్దుల నుంచి గాయపడ్డ వారిని ఈ ఆసుపత్రికి తరలించారు. తమ వద్దకు తీసుకువచ్చిన రైతులలో శుభ్‌కరణ్ సింగ్ తలకు గాయం అయి ఉందని రేఖీ వివరించారు.
ఇప్పుడు మృతి చెందిన రైతుది పంజాబ్‌లోని భటిండా జిల్లా బలోకే గ్రామం అని రైతు నేత బల్దేవ్ సింగ్ సిర్సా తెలిపారు. తమ ఆందోళన దశలో రైతు మృతి ఇది మొదటిదని రైతు నేతలు తెలిపారు. హర్యానా పోలీసులు రైతులపై జులుం సాగించారని, ఓ భాష్పవాయువు, మరో వైపు రబ్బర్ బుల్లెట్లు వాడారని మండిపడ్డారు. రైతులు మాస్కులు ధరించి , కళ్లద్దాలు పెట్టుకుని తమను తాము పొగనుంచి రక్షించుకునేందుకు యత్నించారు. రైతుల కదలికలను పసికట్టేందుకు పలు చోట్ల డ్రోన్లను రంగంలోకి దింపారు. ఇవి ఆకాశంలో చక్కర్లు కొడుతూ కన్పించాయి. పలు ప్రాంతాలలో రైతుల నేతలు అంతా శాంతియుతంగా ఉండాలని కోరడం కన్పించింది.
అయితే అప్పటికే పరిస్థితి చేయిదాటింది. యువరైతులు ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగకుండా రైతు నేతల ప్రతినిధులు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. రైతులు తమ ముందున్న బారికేడ్లను తొలిగించుకుంటూ హర్యానాలోకి దూసుకువచ్చేందుకు యత్నించడంతో ఈ చర్యకు పాల్పడ్డారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు యత్నించారు. ప్రభుత్వంతో జరిపిన చర్చలు నాలుగో విడత కూడా విఫలం అయ్యాయి. దీనితో రెండు రోజుల విరామం తరువాత వేలాది మంది రైతులు ముందుకు కదిలారు. పంటలకు కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, పంటరుణ మాఫీల ప్రకటన రైతుల ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి.
అయితే ప్రభుత్వ స్పందన సరిగ్గా లేకపోవడంతో రైతులు ఆందోళన బాట ఎంచుకున్నారు. రైతుల ఢిల్లీ చలో ఈ నెల 13వ తేదీన ఆరంభం అయింది. అప్పటినుంచి రైతులు శంభు ఇతర సరిహద్దులలో ట్రక్కులు, ట్రాక్టర్లు, మినీవ్యాన్లలో మోహరించుకుని ఉన్నారు. రైతుల వద్ద ఉన్న పనిముట్లు తమకు ప్రమాదకారిగా ఉన్నాయని, రైతులు ముందకు సాగకుండా చేయడమే తమ ముందున్న తక్షణ ఆలోచన , కర్తవ్యం అని భద్రతా బలగాలు నిర్ణయించుకున్నాయి. అధికార యంత్రాంగం నుంచి కూడా ఈ దిశలో స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయని వెల్లడైంది.

**ఐదో దఫా చర్చకు రండి: కేంద్ర మంత్రి అర్జున్ ముండా పిలుపు**

కాగా రైతులు శాంతియుతంగా ఉండాలని, సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవల్సి ఉంటుందని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా పిలుపు నిచ్చారు. రైతుల ప్రతినిధులతో చర్చలకు దిగిన త్రిసభ్య మంత్రుల బృందంలో ముండా కీలక పాత్ర వహించారు. అన్ని విషయాలను చర్చించుకోవచ్చునని, ఐదో దఫా చర్చలకు రావాలని పిలుపు నిచ్చారు. ఎంఎస్‌పి ఇతర ఏ విషయాలపై అయినా చర్చలతో పరిష్కారం కుదురుతుందని, దీనిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

**విజయం కోసం సంయమనం అవసరం**

ఉద్రిక్తతల నడుమనే రైతుల నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. మనమంతా శాంతియుతంగా క్రమశిక్షణతో ఉండాలని కోరారు. గెలుపు కావాలంటే సంయమనం అవసరం అని, గెలుద్దామా ? వద్దా? అని ప్రశ్నించారు. ఈ ఉద్యమాన్ని దెబ్బతీసే శక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సంయమనంతోనే విజయం వస్తుందని తెలిపారు. ఇంతకు ముందు రైతుల ఉద్యమం విజయవంతం అయిందని గుర్తు చేశారు. ఉద్యమం శాంతియుతంగా ఉంటుందని అంతకు ముందు విలేకరుల సమావేశంలో ఈ నేత తెలిపారు. శాంతిని భగ్నపర్చడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు.



# మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వకపోతే బీజేపీని ఓడిస్తాం

- **జాతీయ దళిత సంక్షేమ సంఘం బుదాల బాబురావు,**
- **ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి**

కూకట్ పల్లి విశాలభారతి:

తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, లేనిఎడల పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఓడించి తీరుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బుదవారం హైదరాబాద్ అమీర్ పేట్ హరిజనవాడలో మాదిగల జోడోయాత్ర ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాదిగల పంతం బీజేపీ అంతమే ప్రధాన నినాదంతో ముందుకు వెళ్తామని, ఎస్సీ వర్గీకరణ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ పార్టీ 10 సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు వర్గీకరణ చేయకుండా మాదిగల ను కేవలం ఓటు బ్యాంకుకు మాత్రమే బీజేపీ వాడుకుంటుందని, వర్గీకరణ చేస్తామని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు తెలంగాణలో స్వయంగా దేశ ప్రధాని మోడీ హామీ ఇచ్చి చివరి పార్లమెంటు సమావేశంలో వర్గీకరణ చేయకుండా కమిటీలతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేయడమేనని, ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం కేవలం 10 శాతం ఉన్న అగ్ర వర్ణాల కోసమే పనిచేస్తుందని, 9% ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీల గురించి ఏ నాడు ఆలోచించలేదని, అణగారిన వర్గాలను బీజేపీ పార్టీ తీరని అన్యాయం చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పార్టీకి పుట్టగతులు లేకుండా చేయకుండం కోసం మాదిగ జేఏసీ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగల జోడయాత్ర ఉమ్మడి పది జిల్లాలలో మాదిగలను బీజేపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను గ్రామస్థాయికి తీసుకు వెళ్తామని అన్నారు. మాదిగల జోడోయాత్ర అమీర్ పేట్ నుంచి ప్రారంభమై మెదక్ వరకు కొనసాగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజ్జల మల్లికార్జున్, నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బూదాల బాబురావు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డ యాదయ్య, మాదిగ రాజకీయ వేదిక అధ్యక్షులు ఒక్కల గడ్డ చంద్రశేఖర్, మహా ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యపాగం నరసింహారావు, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, దళిత దండు రాష్ట్ర అధ్యక్షులు మొగులయ్య, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ వీరేందర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రసాద్, మాదిగ యూత్ జెసి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నక్క మహేష్, రాష్ట్ర నాయకులు సరస్వతి, విజయలక్ష్మి, గడ్డం శ్రీరామ్, దేవరకొండ నరేష్, గద్దల రమేష్, జోగు గణేష్, మీసాల మహేష్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ తొలి ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన సీఎం రేవంత్

- **వంశీచంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు**
- **కొడంగల్ బహిరంగ సభలో ప్రతిపక్షాలపై ఫైర్**
- **బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాలు బయట పెడతామని కామెంట్**

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

త్వరలో జరుగనున్న లోక్ సభ ఎన్నికల వేళ సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తొలి అభ్యర్థిని ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులుకు శంకుస్థాపన చేసిన సీఎం.. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్ రెడ్డి పేరును ఖరారు చేశారు. వంశీచంద్ రెడ్డిని 50వేల మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
రాబోయే లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 14 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తేనే దేశ స్థాయిలో తెలంగాణ గొప్పతనం తెలుస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇక రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి ఎన్నికల వారం రోజుల్లోనే రూ.500కు గ్యాస్ సిలిండర్ అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారెంటీలు అమలు చేసే దిశగా ముందుకెళ్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్ త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చారు. రాబోయే కొద్ది రోజుల్లోనే రైతు రుణమాఫీ కూడా చెపడాతామని తెలిపారు. రైతుభరోసాను పది రో జుల్లో అర్హులందరికి వేస్తామని చెప్పారు
ఇక ప్రతిపక్ష పార్టీలపై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ బీఆర్ఎస్ రెండు ఒకటే అన్నారు.. కుట్రలతో కాంగ్రెస్‌ని దెబ్బతీయాలని చూస్తున్నాయన్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్‌వి చీకటి ఒప్పందాలు త్వరలో బయటపడతాయన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా విషయాన్ని మోదీ మరిచారన్నారు. 27 వేల కోట్లు ఖర్చు పెట్టి ఒక ఎకరాకు నీళ్లు ఇవ్వలే అని విమర్శించారు. వేల కోట్లు రూపాయలు కాంట్రక్టర్ల దగ్గర నుంచి కమిషన్లుగా తీసుకున్నారని ఆరోపించారు. పదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు.

# వణికిస్తున్న బర్డ్ ఫ్లూ



- ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా కలకలం
- మూడు రోజుల పాటు చికెన్ షాపులు బంద్
- జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.మహేశ్వరుడు

**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలోని రెండు గ్రామాల్లో ఏవియన్ ఇన్ ఫ్లూయెంజా కలకలం రేపింది. ఈ రెండు ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల ప్రాంతానికి మూడు కిలోమీటర్ల పరిధిలో మూడు రోజుల పాటు చికెన్ షాపులను పోలీసులు మూసివేశారు. వ్యాధి నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని నెల్లూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.మహేశ్వరుడు తెలిపారు. ఈ రెండు కేంద్రాల్లో మూడు నెలల పాటు కోళ్ల పెంపకంపై తాత్కాలిక నిషేధం ఉందని, ఆ తర్వాత 10 నుంచి 20 కోళ్ల పెంపకానికి అనుమతిస్తామని తెలిపారు. ఏవియన్ ఇన్ఫ్లుఎంజా, సాధారణంగా బర్డ్ ఫ్లూ అని పిలుస్తారు. ఇది వైరల్ ఇన్ఫెక్షన్. ప్రధానంగా పక్షులను ప్రభావితం చేస్తుంది కాని అప్పుడప్పుడు మనుషులకు, ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. ఇది అడవి పక్షులలో సహజంగా సంభవించే ఇన్ఫ్లుఎంజా వైరస్ వల్ల వస్తుంది. జనాలకు వ్యాప్తి సాధారణంగా సోకిన పక్షులు లేదా వాటి విసర్జనలతో ప్రత్యక్ష సంబంధం ద్వారా వస్తుంది. జనాల్లో తేలికపాటి శ్వాసకోశ అనారోగ్యం మొదలుకొని న్యుమోనియాకు దారితీస్తుంది. ఒక్కోసారి చనిపోవచ్చు కూడా. ఇక మానవులలో ఏవియన్ ఇన్ఫ్లుఎంజా లక్షణాలు జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, కండరాల నొప్పులు మరియు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగి ఉండవచ్చు. ఇది ఆసుపత్రిలో చేరడం లేదా మరణానికి దారితీస్తుంది. సమస్యలను నివారించడానికి లక్షణాలను ముందుగా గుర్తించాలి. బర్డ్ ఫ్లూ నివారణ చర్యలలో పౌల్ట్రీ ఫారాలలో పరికరాలను క్రిమిసంహారక చేయడం. వ్యాప్తిని వెంటనే గుర్తించడానికి నిఘా అవసరం. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి చేతులు కడుక్కోవడం. పౌల్ట్రీ కార్మికులకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం.

# కుప్పంలో రాజుకున్న నీళ్ల రాజకీయం

- చంద్రబాబు ఇలాకాలో హీటెక్కిన నీళ్ళ రాజకీయం
- నేనంటే నేను అంటున్న అధికార-విపక్షాలు
- వైసీపీ, టీడీపీ మధ్య నడుస్తున్న రాజకీయం
- ఫిబ్రవరి 26న సీఎం వైఎస్ జగన్ కుప్పం పర్యటన



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:**

హంద్రీనీవా నీటి చుట్టూ వైసీపీ, టీడీపీ మధ్య నడుస్తున్న రాజకీయం రంజుగా మారింది. హంద్రీనీవా ద్వారా కుప్పం బ్రాంచ్ కెనాల్ నీళ్లు తెచ్చింది మేమేనంటూ వైసీపీ, నిధులు కేటాయించింది 90 శాతం పనులు పూర్తి చేసింది చంద్రబాబు హయంలోనేనని టీడీపీ. ఇలా రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం రాజుకుంది. పులివెందులకు నీళ్లు ఇచ్చింది తానేనంటూ చంద్రబాబు పదే పదే చేస్తున్న వ్యాఖ్యలకు కౌంటర్ ఎటాక్ ఇస్తున్న వైసీపీ కుప్పంకు నీళ్లు తెరపైకి తీసుకొచ్చింది. దీంతో నీళ్ళ లొల్లి కాస్తా.. పొలిటికల్ హీట్ ను పెంచింది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇలాకా లో ఇప్పుడు హంద్రీనీవా ఇష్యూ హాట్ టాపిక్ అయ్యింది. ఫిబ్రవరి 26న సీఎం వైఎస్ జగన్ కుప్పం పర్యటన కాక రేపుతోంది. కృష్ణా జలాలను పులివెందులకు తెచ్చింది తానేనని చంద్రబాబు, కుప్పంకు నీళ్లు ఇచ్చింది తమ ప్రభుత్వమేనని వైసీపీ చెప్పు కుంటుండటం ఇప్పుడు పొలిటికల్ చర్చకు దారితీసింది. పులివెందులకు నీళ్లు ఇచ్చింది తానేనని చెబుతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు వైసీపీ సర్కార్ కూడా గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తోంది. 14 ఏళ్ళు సీఎంగా చంద్రబాబు కుప్పంకు నీళ్లు కూడా అందించలేక పోయారంటున్నారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్తూరు జిల్లాకు చేసిందేమీ లేదంటోంది. హంద్రీనీవా నీటిని సీఎం వైఎస్ జగన్ పూజ చేసి కుప్పం ప్రజలకు అందిస్తారని మంత్రి పెద్దిరెడ్డి అంటున్నారు. కుప్పంకు నీళ్లు అందించాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్ ఉన్నారంటున్నారు. ఫిబ్రవరి 26 న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పూజలు చేయించి హంద్రీనీవా నీటిని కుప్పం నియోజకవర్గానికి అందిస్తామంటున్నారు మంత్రి పెద్దిరెడ్డి. అయితే తెలుగుదేశం పార్టీ వాదన మరోలా ఉంది. పులివెందులకు కృష్ణా జిల్లాలోని గండి కోట ద్వారా అందించిన ఘనత తమదేనంటున్నారు టీడీపీ నేతలు. కుప్పంకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చిన క్రెడిట్ వైసీపీది మాత్రం కాదంటోంది. ఒక టీఎంసీ కెపాసిటీ తో హంద్రీనీవా నీటిని కుప్పం బ్రాంచ్ కెనాల్ కు తరలించాలని సంకల్పించింది మేమే అంటోంది టిడిపి. కృష్ణా జలాలను తీసుకుని రావాలనుకున్న చంద్రబాబు రూ. 613 కోట్లు కేటాయించి 201419 మధ్య కాలంలో పనులు చేపట్టారని టీడీపీ నేతలు అంటున్నారు. రూ. 520 కోట్లు ఖర్చు చేసి 87శాతం పనులు కూడా పూర్తి చేశారంటున్నారు. పైగా కోర్టులకు వెళ్లి కెనాల్ పనులు నిలిచి పోయేలా చేసింది వైసీపీ నేతలేనని ఆరోపిస్తోంది. మిగిలిపోయిన 13 శాతం పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు వైసీపీ సర్కార్‌కు నాలుగేళ్ల పది నెలలు కాలం పట్టిందని విమర్శిస్తున్నారు టీడీపీ నేతలు. పూర్తి చేసిన పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని హంద్రీనీవాకు పూర్తి స్థాయిలో నీళ్లు రాకపోవడంతో ఇప్పటికే సీఎం పర్యటనలు మూడుసార్లు వాయిదా వేసుకున్న వైసీపీ నేతలు ఇకనైనా మోసపూరిత మాటలు మానుకోవాలంటున్నారు టీడీపీ ఎంఎల్సీ కంచర్ల శ్రీకాంత్. పులివెందులకు చంద్రబాబు హయంలోనే నీళ్లు అందించారని గంటాపథంగా చెబుతున్నారు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్.

# పవన్ కళ్యాణ్‌కు టీడీపీ ఎమ్మెల్యే ట్విస్ట్

- రాజమండ్రి రూరల్ సీటుపై గందరగోళం
- జనసేన నుంచి దుర్గేష్ పోటీ చేస్తారన్న పవన్
- తానే బరిలో ఉంటానంటూ ట్వీట్ చేసిన బుచ్చయ్య



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ సీటు గందరగోళంలో ఉంది. ఈ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో స్వయంగా పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు.. అలాగే అక్కడి నుంచి పోటీ చేయాలని భావిస్తున్న కందుల దుర్గేష్ కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, టీడీపీతో కలిసి ఎన్నికల వెళ్లబోతున్నాయని రాజమండ్రి సమావేశంలో పవన్ కళ్యాన్ తమతో చెప్పినట్లు దుర్గేష్ అంటున్నారు. ప్రజల్లో ఎంత ఆదరణ ఉన్నా అది ఓట్లుగా మలుచుకోవాలని.. సమావేశంలో ఎన్నికల మేనేజ్మెంట్ గురించి పవన్ దిశానిర్దేశం చేశారన్నారు. రాజమండ్రి రూరల్ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నానని.. సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్లను కలుపుకుని వెళ్లాలని పవన్ సూచించారన్నారు. అయితే ఈ గందరగోళంపై ప్రస్తుత రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. 'రాజమండ్రి రూరల్ తెలుగుదేశం కార్యకర్తలకు అభిమానులకి శ్రేయోభిలాషులకు మనవి.. టీవీ న్యూస్‌లలో, వాట్సాప్‌లలో వస్తున్న వార్తలు అనేవి ఊహాజనితం.. అవి నమ్మి భావోద్వేగాలకు గురి అవ్వొద్దు. నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశానుసారం కచ్చితంగా "గోరంట్ల" పోటీ లో ఉంటారు.. దీంట్లో ఏటువంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. దీనికి సంబంధించి తొందరలో నారా చంద్రబాబు నాయుడు గారిచే అధికారిక ప్రకటన ఉంటుంది'అంటూ ట్వీట్ చేశారు.రాజమండ్రి రూరల్ నుంచి తాను పోటీలో ఉంటానని గోరంట్ల బుచ్చయ్య చౌదరి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని కార్యకర్తలకు చెబుతున్నారు. అయితే టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్థానాల్లో మండపేట, రాజానగరం, రాజమండ్రి రూరల్ స్థానాలను కమ్మ సామాజిక వర్గానికి కేటాయిస్తుంది. కమ్మ సామాజిక వర్గానికి సంబంధించిన ఇద్దరు టీడీపీ అభ్యర్థులు రాజమండ్రి రూరల్, రాజానగరం టికెట్లు జనసేనకు ఇస్తారనే ప్రచారం ఆసక్తికరంగా మారింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా రెండు రోజులు పర్యటనలో భాగంగా రాజమండ్రిలో పార్టీ ముఖ్య నేతలతో సమీక్షలు చేస్తున్నారు. రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, అనపర్తి, రాజానగరం నియోజకవర్గాలకు సంబంధించిన 60 మంది జనసేన పార్టీ ముఖ్య నేతలు, టిక్కెట్లు ఆశిస్తున్న ఆశావాహులతో సమావేశం అయ్యారు.మరోవైపు పవన్ కళ్యాణ్ గత నెలలో రాజానగరం, రాజోలు స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా రాజమండ్రి రూరల్ సీటుపై క్లారిటీ ఇచ్చారు. దీంతో టీడీపీ కేడర్ కన్ఫ్యూజన్‌లో ఉంది. టీడీపీ, జనసేన పార్టీల పొత్తుల లెక్కలపై అధికారికంగా ప్రకటన మాత్రం రావాల్సి ఉంది. బీజేపీతో పొత్తుపై క్లారిటీ వస్తే తప్ప అభ్యర్థుల ప్రకటన ఉండదంటున్నారు.

# గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు గుడ్‌న్యూస్

- ఇవాళ్టి నుంచి సర్దుబాటు ప్రక్రియ ప్రారంభం
- సుమారు 5 వేల మంది ఉద్యోగులు స్థానచలనం
- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు అలర్ట్




**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ముఖ్యమైన గమనిక. ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. కొద్దినెలల క్రితం పెద్దఎత్తున గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు కొనసాగాయి. రాష్ట్రంలో కొన్ని సచివాలయాల్లో ఎక్కువ మంది, మరికొన్ని సచివాలయాల్లో తక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్న పరిస్థితి ఉంది. అందుకే అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కనీసం 8 మంది ఉద్యోగులు తప్పని సరిగా పనిచేసేలా ప్రభుత్వం రేషనలైజేషన్ ఉద్యోగుల సర్దుబాటుకు సిద్ధమైంది.10 రోజుల క్రితమే ఇందుకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేయగా.. జిల్లాలో సర్దుబాటు ప్రక్రియకు సంబంధించిన తేదీల వారీగా షెడ్యూల్‌ను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఖరారు చేసింది. ఈ మేరకు సచివాలయాల శాఖ డైరెక్టర్ ధ్యాన్‌చంద్ర మెమో ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం (ఈ నెల 22) కల్లా జిల్లాల వారీగా 8 మంది కన్నా తక్కువ మంది పనిచేస్తున్న గ్రామ, వార్డు సచివాలయాలు.. 8 మంది కంటే ఎక్కువ మంది పనిచేస్తున్న సచివాలయాల వివరాలతో అధికారులు నివేదికలు రూపొందిస్తారు. ఈ నెల 24కు 8మంది కంటే తక్కువ ఉద్యోగులు పనిచేస్తున్న సచివాలయాల్లో ఏ కేటగి రి ఉద్యోగ స్థానాలు ఖాళీగా ఉన్నాయో గుర్తిస్తారు. సచివాలయాల్లో ఆ పోస్టుల భర్తీకి ఇప్పటికే సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ కోసం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్న సచివాలయాల నుంచి సర్దుబాటుకు ఎవరెవరిని ఒకచోట నుంచి మరోచోటకు బదలాయించే ఉద్యోగుల జిల్లాల వారీగా జాబితాను సిద్ధం చేస్తారు. ప్రతి సచివాలయంలో కనీసం 8 మంది పనిచేసే అవకాశం ఉన్నంతవరకు అవసరమైన ఉద్యోగులకు పరిమితే ఆయా జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేస్తారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో సర్దుబాటు ప్రక్రియ కోసం జిల్లాల వారీగా ఎంపిక చేసిన ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి, సర్దుబాటు ప్రక్రియలో పేర్కొన్న ఖాళీల ప్రకారం ఆ ఉద్యోగులకు నచ్చిన సచివాలయానికి బదలాయించే ప్రక్రియ చేపడతారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 15,004 గ్రామ, వా ర్డు సచివాలయాల్లో దాదాపు 1.34 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఈ సర్దుబాటు ప్రక్రియలో సుమారు 5 వేల మంది ఉద్యోగులు స్థానచలనం ఉంటుందని గ్రామ వార్డు సచివాలయాల శాఖ అంచనా వేస్తోంది.

# నెల్లూరు జిల్లా వైసీపీలో మరో వికెట్ డౌన్

- వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
- వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన వేమిరెడ్డి
- రాజీనామా లేఖను సీఎం జగన్ కు పంపిన వైనం
- వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి కూడా రాజీనామా



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్టీని వీడారు. రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న వేమిరెడ్డి నేడు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్ కు పంపించారు. అంతేకాదు, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్ష పదవికి కూడా వేమిరెడ్డి గుడ్ బై చెప్పేశారు. దాంతోపాటే, రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా తాను వదులుకుంటున్నానని వేమిరెడ్డి స్పష్టం చేశారు. వ్యక్తిగత కారణాలతో వైసీపీ నుంచి తప్పుకుంటున్నానని, తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని సీఎం జగన్ ను కోరారు. గత ఎన్నికల సమయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎంతో బలంగా ఉంది. అయితే, గత కొన్నాళ్లుగా జిల్లా వైసీపీలో అసంతృప్తి జ్వాలలు భగ్గుమంటున్నాయి. ఇప్పటికే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వైసీపీని వదిలి, టీడీపీకి దగ్గరయ్యారు. ఇప్పుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా పార్టీ నుంచి తప్పుకోవడం నెల్లూరు జిల్లాలో వైసీపీకి గట్టి ఎదురు దెబ్బగానే భావించాలి. ఇటీవల నెల్లూరు సిటీ కోఆర్డినేటర్ మహ్మద్ ఖలీల్ ను నియమించే సమయంలో వేమిరెడ్డితో మాటమాత్రం చెప్పలేదని తెలుస్తోంది. అప్పటి నుంచి వైసీపీ కార్యకలాపాలకు వేమిరెడ్డి పెద్దగా హాజరు కావడంలేదు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ, అభ్యర్థుల నియోజకవర్గాల మార్పులు చేర్పుల అంశంలో ఆయన అభిప్రాయం తీసుకోకపోవడం మద్దతుదారుల్లోనూ అసంతృప్తిని రగిల్చిందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన మద్దతుదారులతో చర్చించిన అనంతరం వేమిరెడ్డి రాజీనామా నిర్ణయం తీసుకున్నారు.

# సివిల్‌స్‌కు ప్రిపేరైన యువతికి వాలంటీర్ పోస్ట్

- ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన పవన్ కళ్యాణ్
- సివిల్స్, పీజీ చదివి వాలంటీర్ ఉద్యోగాలు చేస్తున్న యువతులు
- వాలంటీర్ ఉద్యోగాలపై విమర్శలు



ఆంధ్రప్రదేశ్, విశాలభారతి: వాలంటీర్ ఉద్యోగాలపై ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విశాఖ రాజధాని చర్చా కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని.. అందులో పెద్దమ్మాయి పీజీ, రెండో అమ్మాయి సివిల్‌స్‌కు ప్రిపేర్ అయ్యిందని, ఇక మూడో అమ్మాయి డిగ్రీ పూర్తిచేసిందని ఆ వ్యక్తి వీడియోలో చెప్తున్నారు. ఉద్యోగాలు రాక ముగ్గురూ ఇబ్బంది పడుతుంటే.. వైసీపీ ప్రభుత్వం ముగ్గురికీ వాలంటీర్ ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పుకొచ్చారు. వాలంటీర్లు సేవ చేస్తూ వారు ఏ ఇంటికి వెళ్లినా స్థానికులు దండం పెడుతున్నారంటూ ఆ వ్యక్తి భావోద్వేగానికి గురయ్యాడు. అయితే ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పీజీ, సివిల్స్ చదివిన అమ్మాయిలు కూడా వాలంటీర్ ఉద్యోగం చేస్తున్నారంటూ కొంతమంది నెటిజనం విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దీనిపై స్పందించారు. వాలంటీర్ ఉద్యోగాల గురించి మరోసారి కీలక వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్.. మరోసారి ఏపీ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పేపర్‌కు ఇచ్చే 200 రూపాయలతో కలిపి వాలంటీర్లకు నెలకు ఐదువేల 200 రూపాయలు ఇస్తున్నారన్న పవన్.. కేవలం ఐదు వేల రూపాయలకు యువశక్తిని ప్రభుత్వం నీరుగారుస్తోందని మండిపడ్డారు. పెద్దపెద్ద చదువులు చదివిన యువతను ఇంత తక్కువ జీతానికే సీఎం జగన్ గ్రామాలలో కట్టిపడేస్తున్నారని ఆరోపించారు. ఏపీలో 33 వేల గ్రామాలు ఉన్నాయని, గ్రామానికి పది మంది చొప్పున లెక్కేసుకున్నా వాలంటీర్ల పేరుతో వీరందరిని కట్టేస్తున్నారని జనసేనాని మండిపడ్డారు. వీరిలో ఎంతోమంది సైంటిస్టులు, వ్యాపారవేత్తలు, ఇంజినీర్లుగా మారే అవకాశం ఉందని, వారిలో దాగున్న ప్రతిభను గుర్తించకుండా ఇలా చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు యువతలో ఉన్న సామర్థ్యాన్ని ఏపీ ప్రభుత్వం గుర్తించడం లేదని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. డిగ్రీలు, పీజీలు చదవిన యువతను వాలంటీర్ల పేరుతో ఐదువేలు ఇస్తూ ఊడిగం చేయించుకుంటున్నారని పవన్ విమర్శించారు.డిగ్రీ చదువుకున్న వాళ్లను ఐదువేలకు పనిచేయమంటే అది ఉద్యోగమా.. లేదా ఊడిగమా అంటూ జనసేనాని ప్రశ్నించారు. మరోవైపు బుధవారం పవన్ కళ్యాణ్ భీమవరంలో పర్యటించారు.

# కుప్పం నుంచి నేను పోటీ చేస్తా : భువనేశ్వరి

- నారా భువనేశ్వరి ఆసక్తికర వ్యాఖ్యలు
- చంద్రబాబుకు రెస్ట్ ఇద్దామన్న భువనేశ్వరి
- కుప్పంలో నిజం గెలవాలి కార్యక్రమం



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:**

చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజం గెలవాలి పేరిట రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న భువనేశ్వరి.. ప్రస్తుతం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో ఉన్నారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్ ప్రారంభించిన భువనేశ్వరి.. అక్కడ జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ క్రమంలోనే చంద్రబాబు గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుప్పంలో తనకు మద్దతిస్తారా లేదా చంద్రబాబుకు మద్దతిస్తారా అంటూ అక్కడున్న వారిని ప్రశ్నించారు. చంద్రబాబును 35 ఏళ్లుగా కుప్పం ప్రజలు గెలిపిస్తున్నారని.. ఈసారి ఆయనకు రెస్ట్ ఇద్దామని భువనేశ్వరి అన్నారు. ఇదే క్రమంలో తనను గెలిపిస్తారా అంటూ సరదాగా చమత్కరించారు. " ఓ జోక్ వేస్తున్నా. మీ ఆన్సర్లన్నీ ఫ్రీగా ఇవ్వాలి. కుప్పం వచ్చిన తర్వాత నా మనసులో ఓ కోరిక కలిగింది. చంద్రబాబుపై నమ్మకంతో 35 ఏళ్ల నుంచి ఎమ్మెల్యేగా చేస్తున్నారు. అయితే ఇక్కడికి వచ్చాక నాకో కోరిక కలిగింది. ఈసారి ఆయనకు రెస్ట్ ఇచ్చి, నేను పోటీ చేద్దామని అనుకుంటున్నా. మీరు ఎవరికి మద్దతిస్తారు. నేను కావాలో, చంద్రబాబు కావాలో చేతులెత్తి చెప్పండి" అంటూ భువనేశ్వరి చమత్కరించారు. అయితే ఇద్దరూ కావాలంటూ అక్కడున్న సభికులు చేతులెత్తటంతో భువనేశ్వరి సరదా వ్యాఖ్యలు చేశారు. ఇద్దరూ కావాలంటే కుదరదనీ, ఎవరో ఒకరి పేరు మాత్రమే చెప్పాలన్నారు. అయితే ఆ తర్వాత ఇదంతా సరదాగా అంటున్నానన్న భువనేశ్వరి.. నా మనసుకు నచ్చిన పనిమాత్రమే చేస్తానన్నారు. నాకే పోస్టులు వద్దంటూ చెప్పారు.

# అంత్యక్రియలకు సిద్ధం చేశాక లేచి కూర్చున్న మహిళ

- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ విచిత్రమైన ఘటన
- 18వ తేదీ విషమించిన ఆరోగ్యం
- చనిపోతారని చెప్పిన డాక్టర్లు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** వెంటిలేటర్ తీసేస్తే 10 నిమిషాల్లోనే చనిపోతారని.. బంధువులకు కబురు పంపమని చెప్పారు ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. మలేషియాలో ఉన్న వరుసకు కొడుకు (సోదరి కుమారుడు)ని కూడా ఆగమేఘాలపై ఊరికి రప్పించారు. అంత్యక్రియలకు అన్నీ సిద్ధం చేశారు. తీరా వెంటిలేటర్‌ను తీసేసి ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ఆమె మళ్లీ లేచి కూర్చొంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ విచిత్రమైన ఘటన జరిగింది. అమలాపురం రూరల్ మండలం జనుపల్లి మన్నా కాలనీకి చెందిన లంకలపల్లి శ్రీరామమూర్తి, సత్యవేణి దంపతులు నివాసం ఉంటున్నారు. సత్యవేణి కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నెల 17న బీపీ రావడంతో కింద పడిపోయారు.. వెంటనే ఆమెను అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. 18వ తేదీ ఉదయానికి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. వెంటిలేటర్ తీసేస్తే చనిపోతుందని డాక్టర్లు చెప్పేశారు. ఆ వెంటనే బంధువులు మలేషియాలో ఉంటున్న కొడుకు వరసయ్యే (సోదరి కుమారుడు)ను హుటాహుటిన పిలిపించారు. అదే రోజున అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసి సత్యవేణిని ఆస్పత్రి నుంచి అంబులెన్సులో ఇంటికి తీసుకువచ్చారు. ఇంతలో ట్విస్ట్ ఇస్తూ కొద్ది సేపటికే ఆమె లేచి కూర్చుని మీరంతా ఎందుకొచ్చారని ప్రశ్నించడంతో అందరూ అవాక్కయ్యారు. ఆమెకు మంగళవారం ఉదయం మళ్లీ బీపీ డౌన్ కావడంతో ఆమెను మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆమె ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అంత్యక్రియలకు అంతా సిద్ధం చేసిన తర్వాత ఓ మహిళ లేచి కూర్చోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# మనవరాలిపై తాత అఘాయిత్యం

- కృష్ణా జిల్లాలో దారుణ ఘటన
- మైనర్ బాలికను గర్భవతిని చేసి పరారీ
- కేసు నమోదు చేసిన పోలీసులు



**ఆంధ్రప్రదేశ్, విశాలభారతి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో అమానుష ఘటన వెలుగు చూసింది. ప్రేమగా, అపురూపంగా చూసుకోవాల్సిన మనవరాలి పట్ల ఆమె తాత అమానుషంగా వ్యవహరించాడు. బెదిరిస్తూ లైంగిక దాడికి పాల్పడిన దారుణ ఘటన తాజాగా బయటపడింది. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఆ మైనర్ బాలికను ఆస్పత్రికి తరలించగా.. పరీక్షలు నిర్వహించిన వైద్యులు నాలుగు నెలల గర్భిణిగా తేల్చారు. దీంతో మైనర్ బాలికను ప్రశ్నిస్తే అసలు విషయం బయటపడింది. అవనిగడ్డ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోపిదేవిలోని దళితవాడకు చెందిన 14 ఏళ్ల మైనర్ బాలిక స్థానికంగా ఉన్న పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఎప్పుడూ ఆడుతూ పాడుతూ హుషారుగా ఉండే ఆ బాలిక ఇటీవల కొంతకాలంగా నిరాశగా, నీరసంగా కనిపిస్తూ వచ్చింది. అయితే చదువు ఒత్తిడిలో అనుకుని ఆమె తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోలేదు. అయితే బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావటంతో ఆమె తల్లి దండ్రులు అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో బాలికను పరీక్షించిన వైద్యులు నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు గుర్తించారు. దీనిపై బాలికను ప్రశ్నించడంతో ఆమె అసలు విషయం బయటపెట్టింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాత తనపై అత్యాచారం చేసినట్లు చెప్పుకొచ్చింది. ఎవరికైనా చెప్తే చంపేస్తానని, బెదిరిస్తూ పలుమార్లు తనపై అత్యాచారం చేసినట్లు బాధిత బాలిక వాపోయింది. దీంతో మైనర్ బాలిక తల్లిదండ్రులు అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. తమ కూతురిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలంటూ ఫిర్యాదు చేశారు. అయితే అప్పటికే ఆయన పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మైనర్ బాలికకు మెరుగైన చికిత్స అందించేందుకు మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అవనిగడ్డ డీఎస్పీ వెల్లడించారు.



## రమాద ఘటనపై ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేయాలి

**సిద్దిపేట, విశాలభారతి:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సబ్ స్టేషన్ లో జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట సబ్ స్టేషన్ లో జరిగిన ప్రమాద ఘటనను ఆయన సందర్శించి విలేకరులతో మాట్లాడారు. సబ్ స్టేషన్ లో మంటలు చెలరేగుతున్నాయి అన్న సమాచారం తెలుసుకోగానే హైదరాబాద్ నుండి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి హుటాహుటిన సిద్దిపేటకు చేరుకోవడం జరిగిందన్నారు. సిద్దిపేటకు వస్తున్న క్రమంలోనే డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్కతో ఫోన్లో మాట్లాడి విద్యుత్ శాఖ డైరెక్టర్ తో పాటు ఉన్నత స్థాయి అధికారులను వెంటనే సిద్దిపేటకు పంపించాలని కోరడం జరిగిందని తెలిపారు. అలాగే విద్యుత్ శాఖ సెక్రెటరీ రిజ్విత సైతం ఫోన్లో మాట్లాడడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేట తో పాటు దుబ్బాక,గజ్వేల్ , హుస్నాబాద్ ల నుండి ఫైరింజలను వెంటనే సిద్ధిపేటకు పంపించాలని అగ్నిమాపక శాఖ అధికారులు సైతం ఆదేశించడం జరిగిందన్నారు

# టెన్త్ రిజల్ట్స లో 100శాతం ఫలితాలు సాధించాలి

- **మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ అదే**
- **గర్ల్స్ హై స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం**
- **పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత బాధాకరం**
- **ఎమ్మెల్యే హరీశ్ రావు**

**విశాలభారతి, హైదరాబాద్:**



రూ. 50 లక్షల సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నాం. రాబోయే కాలం మొత్తం కంప్యూటర్ యుగమే కావున విద్యార్థులు వీటిని వినియోగించుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హై స్కూల్‌లో బుధవారం కంప్యూటర్ ల్యాబ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాల దినదిన అభివృద్ధి జరుగుతుందన్నారు. గతంలో వర్షం వస్తే పెచ్చులు ఉడుతాయని భయంతో ఈ బడిని బంద్ చేసేవారు. కానీ, నేడు కార్పొరేట్ స్కూల్‌ని తలదన్నేలా ఉందన్నారున. త్వరలోనే ఈ పాఠశాలకు ఇన్‌స్ట్రకర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం జీవన విధానంలో భాగమైందని చెప్పారు. జిల్లాలో ఎక్కువ మంది ఆడపిల్లలు చదివే పాఠశాల ఇది . ఈసారి పదో తరగతిలో వందశాతం పలితాలు సాధించాలన్నారు. మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ పదికి పది మార్కులు సాధించడమేనని చెప్పారు. అలాగే నీటిని వృథా చేయవద్దు, అవసరం మేరకే వాడుకోవాలని సూచించారు.

రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల్లో ఔషధాల కొరత బాధాకరమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ ఆరోగ్య మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఔషధాల కొరత ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఆయన చెప్పారు. ఔషధాల కొరతపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సమీక్ష జరిపి పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.



## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి జానపాటి కృష్ణయ్య**

**సూర్యాపేట, విశాలభారతి:** విద్యార్థులు మంచి సత్ ప్రవర్తనతో ఉండి ఉన్నత శిఖరాల అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జనపాటి కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ళ యాదయ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వార్షికోత్సవ వేడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ పౌరులుగా సమాజంలో గొప్ప వ్యక్తులుగా రాణించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. రానున్న వార్షిక పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలను సాధించి రాష్ట్రస్థాయిలో సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని విద్యార్థి, విద్యార్థులకు సూచించారు. కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు లింగం సార్ అర్థశాస్త్రంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. వార్షికోత్సవ సందర్భంగా క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కళాశాల వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తాహెర్ పాషా, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోలి పద్మ, పాపయ్య, రేణుక, ఆంధ్రయ్య, రమణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, కవిత, లింగం, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ మూకదాడి

- **ఏబీవీపీ దాడిని ఖండించిన రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాథోడ్ సంతోష్, కార్తిక్**
- **నేడు జిల్లా వ్యాప్తంగా ఏబీవీపీ దిష్టిబొమ్మ దగ్ధానికి పిలుపు.**

**కూకట్ పల్లి విశాలభారతి:**



కూకట్ పల్లి జెఎన్ టి యు హెచ్ క్యాంపస్ లో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలు తెలుసుకుందామని వెళ్లిన ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వంపై బుదవారం ఎబివిపి గుండాలు చేసిన దాడిని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ ఖండించింది. ఈ సందర్భంగా కూకట్ పల్లి జెఎన్ టి యుహెచ్ లో విద్యార్థులు సమస్యలు తెలుకోవడానికి ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థులతో మాట్లాడి వస్తున్న సందర్భంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో ఎబివిపి నాయకులు దిలీప్ మరియు కొంతమంది అసభ్య పదజాలంతో ఘర్షణకు దిగుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఇతర నాయకులపై దాడిచేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షడు మూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ కూకట్ పల్లి మండల అధ్యక్షడు సుమంత్ కి బూతులు తిడుతూ 10 నుండి 20 మంది ఎబివిపి నాయకులు దాడి చేసి చొక్కా చించి గాయపరిచారు. ఈ చర్యలను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. గతకాలంగా జెఎన్టీయుహెచ్ లో ఎబివిపి ఆరాచకాలకు పాల్పడుతుందని, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ పై ఓర్వలేక దాడులు చేస్తోందని, గతంలో సంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాలో దాడులకు పాల్పడ్డారన్నారు. విద్యార్థుల సమస్యలపై నికార్సుగా పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ ఎదుగుదలను ఓర్వలేక భౌతికంగా దాడులు చేస్తున్నారని, నిజంగా ఎబివిపి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు సమస్యలపై పోరాడాలని భౌతికంగా దాడులు చేస్తే సహించబోమని వారు తెలిపారు. ఈ దాడులను నిరసనగా రేపు జిల్లా వ్యాప్తంగా దిష్టిబొమ్మల దగ్ధానికి పిలుపునిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్‌పిలుపునిచ్చారు. ఇకనైనా దాడుల సంస్కృతి ఎబివిపి మానుకోవాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# పాలమూరు' పూర్తి చేయండి చాలు

- **కొడంగల్ కు నీరందించేందుకు బీఆర్ఎస్ ఎప్పుడో ప్రయత్నం చేసింది**
- **పొత్తులు నిర్ణయించేది అధినేతలు**
- **గల్లీ లీడర్లు కాదు - ప్రాంతీయ పార్టీలతో పొత్తుకు జాతీయ పార్టీలు ప్రయత్నిస్తాయి**
- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కామెంట్స్**

**విశాలభారతి,హైదరాబాద్:**



కృష్ణా తుంగభద్ర నదులే పాలమూరు జిల్లాకు జీవనాధారం అని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 360 రోజులు నీటిని ఉపయోగించుకునేలా కేసీఆర్ పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ తలపెట్టారు. కొడంగల్, నారాయణ పేటకు నీరు ఇవ్వడానికి పాలమూరు నుంచి రెండు కెనాల్స్ను ప్రతిపాదించారు. ప్రస్తుతం పాలమూరు - రంగారెడ్డిలో కేవలం 7 నుంచి 10 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులు పూర్తిచేస్తే కొడంగల్,నారాయణ పేటకు గ్రావిటీ ద్వారా నీరు అందించవచ్చు. కానీ ఆ రెండు కెనాల్స్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా రూ.2,900 కోట్లతో ఆ రెండు నియోజకవర్గాల కోసం కొత్త ప్రాజెక్ట్‌కు ప్లాన్ చేసింది. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేస్తున్నారు. కానీ ప్రతిపాదిత నిధుల్లో కేవలం అరవై డెబ్బై శాతం ఖర్చు పెడితే ఓపెన్ కెనాల్‌తో నీరు ఇవ్వొచ్చు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టుతో నీరు ఇవ్వొద్దనే భేషజంతోనే సీఎం రేవంత్ మళ్లీ కొత్త ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు అని నిరంజన్ రెడ్డి తెలిపారు.

పాలమూరు, రంగారెడ్డి పనులు పూర్తి చేసి నీరిస్తేనే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు నిరంజన్ రెడ్డి. జూరాలపై కొత్త ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ప్రజలపై భారం పడుతుంది. బేషజాలకు వెళ్లకుండా కెనాల్స్ పూర్తి చేస్తే తక్కువ ఖర్చుతో నీరు ఇవ్వొచ్చు. శ్రీశైలంకు వచ్చే నీటిని ఆపేసేలా కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై బ్యారేజ్ నిర్మాణం తలపెడుతోంది. ముందు దాన్ని అడ్డుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే మాట్లాడి దాన్ని అడ్డుకోవాలి అని నిరంజన్ రెడ్డి సూచించారు.

జాతీయ పార్టీల పొత్తుల కోసం అర్రులు చాచటం లేదు. జాతీయ పార్టీలే ప్రాంతీయ పార్టీలతో పొత్తులు కోసం ప్రయత్నిస్తున్నాయి. పార్టీల పొత్తులు అనేవి అయా పార్టీల అధినేతలు నిర్ణయిస్తారన్నారు అని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.



## పట్టుబడితే కఠిన చర్యలు

**ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్**

**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొన్ని రోజుల నుండి మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తుల పై స్పెషల్ డ్రైవ్. నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 30 మంది వాహనదారులకు బుధవారం స్థానిక భద్రాచలం ట్రాఫిక్ పోలీస్స్టేషన్ లో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ మాట్లాడుతూ తాగి వాహనాలు తీసేటప్పుడు వాహనదారులు వారి యొక్క కుటుంబసభ్యుల గురించి ఒక్కసారి ఆలోచించాలని ఏదైనా ప్రమాదం జరిగి ఇబ్బంది పడే కంటే ఎవరూ తాగి వాహనాలు నడపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఆయన కౌన్సెలింగ్ ద్వారా వాహనదారులకు తెలిపారు. మళ్లీ ఇదే విధంగా తాగి వాహనాలు నడిపి దొరికినట్లు అయితే వారి యొక్క లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ హెచ్చరించారు. పట్టణం లోని వాహనదారులు ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలను నడపవద్దని ఇక నుండి ప్రతి రోజు భద్రాచలం పట్టణంలో ఏదో ఒక ప్రదేశంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



## శ్రమ దోపిడీ చేస్తున్న ప్రభుత్వాలు

**పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి**

**మణుగూరు, విశాలభారతి :** మండలంలో ఉపాధి కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొల్లం రాజు,సత్రపల్లి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మణుగూరు మండల పరిధిలోని ముత్యాలమ్మ నగర్ లో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను గ్రామ సమీపంలో ఫారెస్ట్ జామాయిల్ లో పనిచేస్తున్నటువంటి ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా వందలాదిమంది ఉపాధి కూలీలు మండుటెండల్లో పనులు చేస్తున్నారని అన్నారు. కనీసం పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి పనులు చేస్తున్నటువంటి ఉపాధి కూలీలకు వేతనాలు రాక అర్థాకాలితో అలమటిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు గడ్డపార, పార, తట్టలు సొంత ఖర్చులతో కొనుక్కొని పనులు చేస్తున్నటువంటి పరిస్థితి ఉందని గతంలో ఈ పరికరాలను ప్రభుత్వమే ఇచ్చిందని ఇప్పుడు ప్రభుత్వ అధికారులు ఉపాధి కూలీలకు పరికరాలను తక్షణమే అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హేమంతరావు, ప్రియాంక, లక్ష్మి, స్వాతి, ఉమారాణి, పూజిత జూన్ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మహా జాతర షురూ

**ముగ్గురు మూడు దిక్కుల నుంచే..**

కన్నెపల్లి నుంచి సారలమ్మ, గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవిందరాజు ప్రతిరూపాలను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. సారలమ్మ, పగిడిద్దరాజు గోవిందరాజు ప్రతిరూపాల ప్రతిష్ఠాపనతో తొలిఘట్టం ముగిసింది. ఈ కార్యక్రమమంతా పూర్తిగా ఆదివాసీ ఆచారాల ప్రకారమే జరిగింది. 78 కిలోమీటర్ల దూరంలో ఉన్న పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు ప్రతిరూపాలతో ఆదివాసీ పూజారులు మంగళవారమే బయలుదేరారు. కాళ్లకు చెప్పుల్లేకుండా పూర్తిగా కాలినడకన సాగే ఈ యాత్రలో ఏడు వాగులు, దట్టమైన అడవి మీదుగా ప్రయాణించి బుధవారం రాత్రి సారలమ్మ గద్దె పైకి చేరుకున్నారు. అటు 40 కిలోమీటర్ల దూరంలోని కొండాయి నుంచి గోవిందరాజు ప్రతిరూపాలతో పూజారులు అదే సమయానికి గద్దెల దగ్గరకు చేరుకున్నారు. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ ప్రాంతమంతా సమ్మక్క సారక్క నామస్మరణతో మార్మోగింది.

**దారులన్నీ వనం వైపే..**

దారులన్నీ వనం వైపే వెళ్తున్నాయి. జనం చూపు తల్లుల వైపుకే ఉన్నాయి. ఎప్పుడెప్పుడా అంటూ గత రెండు నెలల నుంచి ఎదురు చూస్తున్న మేడారం జాతర రానే వచ్చింది. నాలుగు రోజులు జరిగే తల్లులు మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు అన్ని దారులు తల్లుల వైపే మరులుతున్నాయి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మహా జాతర నేటితో ప్రారంభమైంది. తాడ్వాయి కీకారణ్యం ఇప్పటికే జనారణ్యంతో నిండి ఇక్కడి గ్రామాలు వెల వెల పోతున్నాయి. బుధవారం నుంచి నాలుగు రోజులు పాటు జరిగే మేడారం మహా జాతరకు వివిధ రాష్ట్రాలు ఛత్తీస్గఢ్, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర నుండి భక్తులు కోటి పై చిలుకు చేరి భక్త జన సంద్రంగా మారుతోంది.

మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల మేడారం వెళ్లే భక్తుల వాహనాలు కొత్తగూడ గుండా మేడారం బాట పట్టారు. దీంతో గంగారం, కొత్తగూడ , నర్సంపేట దారి పొడుగునా భక్తుల వాహనాలు దర్శనం ఇస్తున్నాయి. ఉమ్మడి కొత్తగూడ మండలం నుండి భక్తుల తల్లులను దర్శించుకోవడానికి భక్తుల సౌకర్యార్థం ఆర్టీసి డిపార్ట్మెంట్ వారు కొత్తగూడలో బస్సు సెంటర్ ను సైతం ఏర్పాటు చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి మేడారం తరలే భక్తులు బస్సులలో వెళ్లేందుకు కొత్తగూడకు భారీగా చేరుకుంటున్నారు. ఎవరి నోట విన్నా మేడారం మాటే వినిపిస్తోంది. దీంతో కొత్తగూడ అంతా భక్తులతో కళకళలాడుతుంది.

పోటెత్తిన భక్తజనం.. వారందరికీ 4 రోజులు సెలవులు రెండేళ్లకోసారి జరిగే జనజాతరకు భక్తజనం పోటెత్తుతోంది. కోర్కెలు తీర్చే తల్లుల దర్శనానికి తండోపతండాలుగా మేడారానికి కదిలారు భక్తులు. మహాజాతరలో తొలిఘట్టమైన వనదేవతలు గద్దెలపైకి చేరే ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన జనంతో కీకారణ్యం జనారణ్యమైంది. మేడారం జాతర నేపథ్యంలో ములుగు జిల్లాలో ఉన్నటువంటి స్కూల్స్, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. నాలుగు రోజులపాటు సెలవులు ప్రకటిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సండే కూడా సెలవు కావడంతో వరుసగా 5 రోజులు సెలవులు వచ్చాయి.

**పక్కాగా అన్ని ఏర్పాట్లు**

మేడారం జాతర కోసం దేవాదాయ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు పార్కింగ్ తదితర చిన్న, చిన్న సమస్యలు ఎదురైనప్పటికీ, తాగునీరు, వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జాతరకు వచ్చేందుకు ప్రత్యేక బస్సులతో పాటు పర్యాటక శాఖ హెలికాప్టర్ల సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఇక మేడారం జాతర నిర్వహణకు కేంద్రం 3.14 కోట్ల నిధుల కేటాయించింది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి రూ.2.30 కోట్లు, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నుంచి రూ. 0.84 కోట్ల నిధులు విడుదల చేసింది.

**చరిత్రగల్ల సమ్మక్క- సారలమ్మ మహాజాతర**

**అరికెళ్ల వేణు, ములుగు ప్రతినిధి:**

ఆ జాతర అడవి తల్లులది. కానీ.. అంతర్జాతీయ ఖ్యాతి. ఆ ఉత్సవం కొండకోనల్లో జరుగుతుంది. అయితేనేం, తండోపతండాలుగా భక్తులు. తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే సమ్మక్క సారలమ్మ జాతర ఫిబ్రవరి 21నుంచి 24 వరకు ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో మేడారం జాతరపై ప్రత్యేక కథనం. కాకతీయ సైన్యం లక్నవరం సరస్సు దగ్గర స్థావరం ఏర్పాటుచేసుకుని యుద్ధానికి దిగింది. పగిడిద్దరాజు, అతని కుమార్తెలు నాగులమ్మ, సారలమ్మ, అల్లుడు గోవిందరాజు సైన్యాన్ని మేడారం సరిహద్దులోని సంపెంగ వాగు వద్ద నిలువరించి, పోరాడి వీరమరణం పొందారు. కుమారుడు జంపన్న ఆత్మాభిమానంతో సంపెంగ వాగులో పడి ఆత్మాహుతి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి సమ్మక్క పరాశక్తి అవతారమెత్తింది. ఓటమి తప్పదని కాకతీయ సైనికులు దొంగచాటుగా బల్లెంతో పొడిచారు. సమ్మక్క యుద్ధభూమి నుంచి చిలుకల గుట్టకు వెళ్లి అదృశ్యమైంది.

**విగ్రహారాధన లేదు**

సమ్మక్క అదృశ్యమైన గుట్ట ప్రాంతంలో నాగవృక్షం దగ్గర ఒక కుంకుమ భరిణె లభించింది. ఆ భరిణెనే సమ్మక్కగా భావించి రెండేండ్లకు ఒకసారి మాఘ పౌర్ణమి రోజున పండుగ జరుపుకొనేవారు. అదే కాలక్రమేణా మేడారం సమ్మక్క సారలమ్మ జాతరగా రూపాంతరం చెందింది. పగిడిద్ద రాజు.. సారలమ్మ.. నాగులమ్మ.. జంపన్న.. గోవిందరాజు కూడా దైవ స్వరూపాలు అయ్యారు. నాలుగు రోజులపాటు ఈ జాతర ఘనంగా జరుగుతుంది. తొలిరోజున సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపైకి చేరుకుంటారు. గిరిజన సంప్రదాయంలో విగ్రహారాధన ఎక్కడా కనిపించదు. వెదురుకర్ర, కుంకుమ భరిణె తదితర ప్రతీకలే ఇక్కడ ఉత్సవ మూర్తులు. అప్పట్లో నెమలినార చెట్టు ఉన్న ప్రాంతమే నేటి గద్దె అని చెబుతారు.

**సారలమ్మ రాక**

సమ్మక్క కూతురైన సారలమ్మ నివాసం కన్నెపల్లి. మేడారం గద్దెలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలోని చిన్న దేవాలయంలో సారలమ్మ కొలువై ఉంది. ఫిబ్రవరి 21 జాతరలో మొదటి రోజు. ఉదయాన్నే పూజారులు రెండు గంటలపాటు పూజలు నిర్వహించిన అనంతరం, సారలమ్మను కన్నెపల్లి నుంచి కాక వంశస్తులు గద్దె వద్దకు తీసుకొస్తారు. సమ్మక్క భర్త పగిడిద్దరాజు పూనుగొండ్ల నుంచి బయలుదేరి వస్తాడు. పగిడిద్దరాజును పెనక వంశీయులు తీసుకొస్తారు. సారలమ్మ భర్త గోవిందరాజులను కొండాయి నుంచి మేడారంలోని గద్దెకు తీసుకొస్తారు. గోవిందరాజులను కూడా పెనక వంశస్తులే తీసుకొస్తారు. భక్తులు తడిబట్టలతో గుడి ఎదుట తల్లికి వందనం సమర్పిస్తారు. దేవతారూపాన్ని చేతబట్టుకుని బయటికి వచ్చిన పూజారులు సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న వారిపై నుంచి నడిచి వెళ్తారు. సారలమ్మే తమపైనుంచి వెళ్తున్న అనుభూతితో భక్తులు తరించిపోతారు. మంగళహారతులు, కొబ్బరి కాయలతో పూజలు చేసి సారలమ్మను మేడారానికి సాగనంపుతారు. అక్కడి నుంచి సారలమ్మను తీసుకుని బయల్దేరిన పూజారులు జంపన్న వాగునుంచి నేరుగా మేడారంలోని సమ్మక్క గద్దెల వద్దకు తీసుకొస్తారు. అంతకుముునుపే మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పూనుగొండ్లలోని బృందం పగిడిద్దరాజుతో బయల్దేరుతుంది. దాదాపు తొంభై కిలోమీటర్లు నడిచి జాతర నాటికి మేడారానికి వచ్చేస్తుంది. సారలమ్మ గద్దెకు చేరుకునే రోజే తండ్రి పగిడిద్దరాజు ప్రత్యక్షం అవుతాడు. సారలమ్మ భర్త గోవిందరాజులు ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామంలో కొలువై ఉంటాడు. జాతర రోజు ఉదయమే గ్రామస్తులంతా గోవిందరాజును తీసుకుని ఊరేగింపుగా మేడారానికి బయల్దేరతారు. అలా ఒకే రోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులస్వామి గద్దెలపైకి చేరుకుంటారు.

**కుంకుమ భరిణే దేవత**

రెండో రోజు అధికార లాంఛనాలతో పోలీసుల తుపాకీ కాల్పుల గౌరవ వందనం, ఎదురుకోళ్ల ఘట్టంతో భక్తులు సమ్మక్కను ఆహ్వానిస్తారు. ఉదయమే పూజారులు వనానికి వెళ్లి వెదురుకర్రలు తెచ్చి గద్దెల పై ప్రతిష్ఠిస్తారు. అనంతరం సమ్మక్క పూజా గృహం నుంచి వడ్డెలు పసిడి కుండలను తెచ్చి గద్దెలపై నెలకొల్పుతారు. పోలీసు భద్రత మధ్య పూజారులు సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు. మేడారానికి ఈశాన్యాన చిలకల గుట్టపై నారచెట్టుకింద ఉన్న కుంకుమ భరిణె రూపంలోని సమ్మక్కను తెచ్చేందుకు పూజారులు బయల్దేరుతారు. ఈ సమయంలో ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొంటుంది. ఆనవాయితీలో భాగంగా మేడారంలోని చిలుకల గుట్టపై ఉన్న సమ్మక్క దేవతను కొక్కెర వంశస్తులు కుంకుమ భరిణె రూపంలో మేడారంలోని గద్దెకు తీసుకొస్తుంటారు. జాతర మొత్తానికి ప్రధాన దేవత అయిన సమ్మక్క రాక కోసం ఎదురుచూస్తున్న లక్షలాదిమంది భక్తులు చిలకల గుట్ట సమీపంలో పోగవుతారు. తల్లిని కనులారా చూడాలని తపిస్తారు. మహిమాన్వితమైన కుంకుమ భరిణెను తాకేందుకు ప్రయత్నిస్తారు. చిటారుకొమ్మలెక్కి తల్లి రాకకోసం ఎదురుచూస్తారు. ప్రధాన పూజారి ఒక్కరే చిన్న కాలిబాటన నడుచుకుంటూ చిలకల గుట్టపైకి వెళ్తాడు.

**తిరిగి వనంలోకి**

ఉత్సవ మూర్తులంతా గద్దెలపై కొలువై మూడో రోజు అందరికీ దర్శనం ఇస్తారు. మహాజాతరలో ఈ మూడో రోజే అత్యంత కీలకం. తర్వాతి రోజు... అంటే జాతరలో చివరి రోజు వన దేవతలను మళ్లీ వనంలోకి సాగనంపుతారు. పూజారులు దేవతలను వనప్రవేశం చేయించడంతో మహాజాతర పరిపూర్ణం అవుతుంది. గద్దెలపై ఆసీనులైన సమ్మక్క, సారలమ్మలు మూడోరోజు అశేష జనావళికి దర్శనమిస్తారు. జంపన్నవాగులో పుణ్యస్నానాల అనంతరం భక్తులు తల్లులను దర్శించుకుంటారు. కానుకలు, మొక్కులు సమర్పించుకుంటారు. తలనీలాలు, తులాభారాలు జరిపిస్తారు. మహిళలు ఒడిబియ్యం పోసి కొలుచుకుంటారు. చీరసారెలు పెట్టి పూజిస్తారు. దర్శనానికి వచ్చిన లక్షలాది మందితో గద్దెల ప్రాంగణాలు జన సముద్రమవుతాయి. ఆస్తి, కుల, మత భేదాలు లేకుండా అన్ని వర్గాల భక్తులు సమ్మక్క సారలమ్మలకు మొక్కులు అప్పగించుకోవాల్సిందే. వన దేవతలకు అత్యంత ప్రీతిపాత్రమైన వాటినే మొక్కులుగా సమర్పిస్తారు. భక్తులు తమ ఎత్తు బెల్లాన్ని బంగారంగా అమ్మ వార్లకు సమర్పిస్తారు. సారలమ్మ రాకతో ప్రారంభమై అమ్మల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది. ఈ జాతర గిరిజనుల హృదయావిష్కరణ. ప్రతి అడవిబిడ్డలో అమ్మ ఒడిని చేరిన ఆనందం. తిరిగి వెళ్తున్నప్పుడు.. ఆ కండ్లనిండా వెలుగు. ఆ వెలుగులో సమ్మక్క, సారలమ్మలు!

**ఎదురుకోళ్లతో స్వాగతం**

చిలకల గుట్టపై రహస్య ప్రదేశంలో నిక్షిప్తమై ఉన్న సమ్మక్క దగ్గర సుమారు మూడు గంటలపాటు పూజలు నిర్వహిస్తారు.























# ఓట్లు మావి సీట్లు లంబాడాలకా..?

- ఇదెక్కడి సామాజిక న్యాయం
- జనాభా ధమాషా ప్రకారం ఆదివాసి లకు న్యాయం చెయ్యాలి
- పార్టీలకు అతీతంగా ఐక్యం అవుతాం

**కరకగూడెం, విశాలభారతి:** మహబూబాబాద్ పార్లమెంట్ సీటును అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీ సామాజిక వర్గానికే కేటాయించాలని, లేని పక్షం లో ఆదివాసీలం అందరం పార్టీలకు అతీతంతంగా ఒక్కటై ఆదివాసీ అస్తిత్వ పోరాటానికి శ్రీకారం చూడతామని కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశా వాహులు చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని కోర్టు సెంటర్ లో ఉన్న ముత్యాలమ్మ తల్లి కి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసిలకే అన్ని పార్టీలు టికెట్ ఇవ్వాలనే డా" బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కర పత్రాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ధమాషా ప్రకారం మహబూబాబాద్ పార్లమెంట్ సీటు ఆదివాసీ లకే దక్కాలి, కానీ వరుసగా లంబాడా సామాజిక వర్గానికె కేటాయిస్తూ ఆదివాసిల ఆత్మ గౌరవాన్ని కించపరుసస్తూగౌరవం ఇవ్వడం లేదని, ఇది చాలా దారుణం అని అన్నారు.వరుసగా లంబాడా సామాజిక వర్గమైన 1) పోరిక బలరాం నాయక్, 2) అజ్మీరా సీతారాం నాయక్, 3) మాలోత్ కవిత లకు కేటాయించారు అని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం లంబాడా సామాజిక వర్గ జనాభా కంటే 1 లక్షా 71 వేల 221 ఓట్లు ఆదివాసీ ల ఓట్లు ఎక్కువ ఉన్నాయి అయినా కానీ ఉద్దేశ్యపూర్వకంగా లంబాడాలకే కేటాయించడం అన్యాయం ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జాక్ రాష్ట్ర ఇంచార్జి, కన్వినర్ పొడుగు శ్రీనాద్,తుడుం దెబ్బ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు వట్టం నారాయణ, గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, మహబాద్ జాక్ కన్వినర్ తాటి జనార్దన్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొమరం బుచ్చయ్య, పొలిటికల్ జాక్ రాష్ట్ర కన్వినర్ వాసం రామకృష్ణదొర, జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం రాష్ట్ర కార్యదర్శి సోయం శుక్రామ్, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే దొర తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

**ఘనంగా స్వపరిపాలన దినోత్సవం వేడుకలు**



**తుంగతుర్తి, విశాలభారతి:** విద్యార్థులు ఉన్నత లక్ష్యం తో ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చనీ శ్రీ విద్యా భారతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి మల్లయ్య పాఠశాల డైరెక్టర్ ఎండి నసీరుద్దీన్ లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఘనంగా స్వ పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు గుర్తింపు తేవాలన్నారు. విద్యార్థులు చదువు ను కష్టపడి ఇష్టపడి చదివినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అన్నారు. చదువును నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో చదవాలన్నారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, మంత్రులుగా ప్రజాప్రతినిధులుగా పాత్రలు నిర్వహిస్తూ తమ పాత్రల్లో జీవించి పలువురిని అబ్బురపరిచారు. ముఖ్యంగా విద్యార్థి ఉపాధ్యాయులు తరగతి గదులలోకి ప్రవేశించి సంబంధిత పాఠ్యాంశాన్ని బోధించి వారిని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టిన విధం చాలా చక్కగా పాత్రల్లో జీవించారు. ముఖ్యంగా మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై భారీ కాన్వాయలతో రాష్ట్రపతి ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు పర్యటించడంతో పాటు మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రసంగాలు చేయడం పలువురి చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లయ్య పాఠశాల డైరెక్టర్స్ కోట వెంకట గోపాల్ ఉపాధ్యాయులు అంబటి రమేష్, సురేష్, ఈరోజి గోపాల్ రావు, సరిత, సంధ్య, రాధా ఉమా , సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.




# సోషలిస్టు రాజ్య స్థాపకుడు లెనిన్

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు**

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రపంచంలో మొట్టమొదటిసారిగా కార్మిక వర్గ నాయకత్వాన సోషలిస్ట్ విప్లవ సాధించిన రథసారథి కామ్రేడ్ లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు.బుధవారం సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎం వి ఎన్ భవన్ లో కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిర్భవించిన రోజు అయిన ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డే సందర్భంగా లెనిన్ ఓ విప్లవ ఆయుధం అనే పుస్తకం పై యాదగిరిరావు మోడ్రేట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా ఆచరిస్తూ బూర్జువా వర్గంపై విప్లవ బావుట ఎగరవేసిన గొప్ప వ్యక్తి లెనిన్ అని అన్నారు.1917లో రష్యా విప్లవం తో ప్రపంచలో అనేక దేశాలు వలస పాలన పైన విముక్తి సాధించాయని ఆయన అన్నారు.1917 రష్యా విప్లవంతో ప్రపంచంలో మూడో వంతు జనాభా సోషలిస్టు వ్యవస్థ కింద కొనసాగుతున్నాయని వారు అన్నారు. ప్రపంచంలో అనేక సంక్షోభాలు వచ్చిన తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకొని ముందుకు సాగుతున్నాయని అన్నారు. 2019లో వచ్చిన కోవిడ్ ను సమర్థవంతంగా ఎదుర్కొని కోవిడ్ ను నివారించడంలో లెనిన్ చూపిన బాటలో నడుస్తున్న సోషలిస్ట్ దేశాలు అగ్ర భాగాన ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి వ్యవసాయ కార్మికు సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు జిల్లా నాయకులు వేల్పుల వెంకన్న, పులుసు సత్యం, దండా వెంకటరెడ్డి వీరబోయిన రవి, రాంబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ శాఖకు పేరు ప్రతిష్టలు తేవాలి

**ట్రైనీ కానిస్టేబుళ్ల శిక్షణా కార్యాక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ**

**నల్లగొండ, విశాలభారతి:** జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా ఎంపికైన ట్రైనీ కానిస్టేబుల్స్ కు 9 నెలల శిక్షణ నిమిత్తం సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల నుండి వచ్చిన ఏఆర్ విభాగానికి చెందిన 203 మంది పురుష అభ్యర్థుల శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా యస్.పి చందన దీప్తి ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా నూతన ట్రైనీ కానిస్టేబుళ్ళ కు ముందుగా అభినందనలు తెలిపి మాట్లాడుతూ వేలాది మంది అభ్యర్థులతో పోటీపడి తుది పరీక్షలో అర్హత సాధించి ఎంపికై శిక్షణ కోసం పోలీస్ శిక్షణా కేంద్రానికి వచ్చి తొమ్మిది నెలలు పాటు క్రమశిక్షణతో వ్యహరిస్తూ శిక్షణ సమయంలో ఇండోర్ మరియు ఔట్ డోర్ లలో శిక్షకుడు తెలిపే ప్రతి అంశాలపై పట్టు సాధిస్తూ తొమ్మిది నెలలు పూర్తి చేసుకొని ముందుకు సాగాలని అన్నారు. పోలీస్ శాఖలో సమాజంలో ప్రజా సేవ చేయుటకు మంచి అవకాశం ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజా సేవ చేస్తూ సమాజంలో మంచి గుర్తింపు పొందాలని అన్నారు. ఈ తోమ్మిది నెలల పాటు కోనసాగే ఈ శిక్షణ విజయవంతంగా పూర్తికొని అప్పగించిన విధుల్లో రాణిస్తూ ముందు ముందు ఉన్నత స్థాయిలకు వెళ్తూ పోలీస్ శాఖకు మీ కుటుంబ సభ్యులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమములో డిటిసి ప్రిన్స్‌పాల్ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, వైస్ ప్రిన్స్‌పాల్ డిఎస్పీ విఠల్ రెడ్డి, యస్.బి డీఎస్పీ రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్పీ లక్ష్మి నారాయణ, సిఐలు గోపి,సత్యనారాయణ, కొండల్ రెడ్డి,కరుణాకర్, ఆర్ఐలు హరిబాబు,సూరప్ప నాయుడు, యస్.ఐలు మరియు ఆవుట్ డోర్, ఇన్‌డోర్ సిబ్బంది పాల్గోన్నారు.



# వ్యసనాలకు అలవాటు పడొద్దు

- మంచి భవిష్యత్తు కోసం లక్ష్యం పెట్టుకొని కష్టపడాలి
- రాహుల్ హెగ్డే ఐపిఎస్

**సూర్యాపేట, విశాలభారతి:** విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడవద్దని మంచి భవిష్యత్తు కోసం లక్ష్యం పెట్టుకొని కష్టపడాలని సూర్యాపేట జిల్లా ఎస్ పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ అన్నారు. జిల్లా పరిధిలోని మేళ్ళచెరువు పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ ఐ , సిబ్బంది రేవూరు రోడ్డు నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక విద్యార్థి వద్ద కొంత గంజాయి లభించినది, అతని సమాచారం మేరకు నిఘా ఉంచి జగ్గయ్యపేటకు చెందిన బొజ్జగాని రోహిత్ అనే యువకుడిని అదుపులోకి తీసుకోవడం జరిగినదని, అతని వద్ద 120 గ్రాముల గంజాయి గుర్తించి సీజ్ చేశామని తెలిపినారు. విద్యార్థి పై, సరఫరా చేసే వ్యక్తి పై ఇరువురిపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయడం జరిగినదని తెలిపారు.జిల్లాలో గంజాయి వినియోగించే వారి, అమ్మే వారి, సరఫరా చేసే వారి పూర్తి సమాచారం ఉన్నదని ,అందరిపై నిఘా ఉంచామని,గంజాయి సఫరా, అమ్మకం, త్రాగటం నేరం ఈ రకమైన నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం, గంజాయి వల్ల యువత భవిష్యత్తును కోల్పోతున్నారు అన్నారు.గ్రామీణ యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. చిన్న చిన్న ప్యాకెట్ లలో గ్రామాలకు గంజాయి తెచ్చి యువతకు, విద్యార్థులకు అలవాటు చేసి తర్వాత అధిక ధరలకు విక్రయిస్తారు, ఇలాంటి వారి మాయలో పడొద్దు, గంజాయి మత్తుకు బానిసలు కావద్దు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల, మీ పిల్లల అలవాట్లను గమనించండి, వారు తప్పుదోవ పట్టకుండా చూడండి, గంజాయి నిర్మూలనలో పోలీసు వారితో సహకరించి సమాచారం అందించి, మీ పిల్లల భవిష్యత్తును కాపాడాలని అని ఎస్పి అన్నారు. కార్యక్రమంలో కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ రాము, మెల్లచేరువు ఎస్ ఐ పరమేష్ ఉన్నారు.



# వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**నకిరేకల్, విశాలభారతి:** చిట్యాల మున్సిపాలిటీకి చెందిన బిఆర్ఎస్ పార్టీ కోఆప్షన్ మెంబర్ పాటి మాధవరెడ్డి కుమారుడి వివాహానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన శాసనమండలి చైర్మన్

**నల్లగొండ, విశాలభారతి:** హైదరాబాద్ ఇంజాపూర్ లోని వి.ఎం.ఆర్ కన్వెన్షన్ లో చిట్యాల మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యులు పాటి మాధవరెడ్డి అరుణాదేవి ల కుమారుడు వరుణ్ కుమార్ రెడ్డి ప్రియాంక వివాహ వేడుకకి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిలు హాజరై నూతన వధూవరులని ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, నాయకులు పొన్నం లక్ష్మయ్య, ఉప్పల్ రెడ్డి, నర్రా మోహనరెడ్డి, గోధుమగడ్డ యాదిరెడ్డి, తెరటుపల్లి హనుమంతు, బీష్మారెడ్డి పాల్గొన్నారు.



# ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దు

**పినపాక తహసిల్దార్ సూర్యనారాయణ**

**పినపాక , విశాలభారతి :** రేషన్ కార్డు ధరలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని పినపాక తహసిల్దార్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కార్యాలయంలో రేషన్ డీలర్లతో తాసిల్దార్ సూర్యనారాయణ బుధ వారం నాడు సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రేషన్ డీలర్లు తాసిల్దార్ కు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు తెలిపిన సమస్యల పై రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని తెలిపారు. రేషన్ కార్డు దారులు పీకేవైసీ గురించి చేసిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డు దారులను ఇబ్బంది పెట్టకుండా నీకేవైసి డీలర్ల దగ్గర ఉన్న ఈ పాస్ మిషన్ ద్వారా చేయాలని మీ సేవకు ఏ ఒక్క కార్డు హోల్డర్లో పంపవద్దన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు బాలకృష్ణ, వీరభద్రం, సీనియర్ అసిస్టెంట్ రమేష్, రేషన్ డీలర్లు ప్రకాష్, సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యా సామగ్రి పంపిణీ

**నూతనకల్, విశాలభారతి:** లింగంపల్లి గ్రామంలో 10 వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్యాడ్స్,పెన్నులు నూతనకల్ మండల యువజన కాంగ్రెస్ ఆద్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చల్లా తేజ గారి సహకారంతో అందించడం జరిగింది.



# ఓటు నమోదుకు గడువు పెంపు

- అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎస్ వెంకట్రావ్

**సూర్యాపేట, విశాలభారతి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎం.ఎల్.సి ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు వచ్చే మార్చి 14 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. బుధవారం ఎం.ఎల్.సి. ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు ఎస్.పి నాగేశ్వరరావు తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అర్హులైన పట్టభద్రులు ఇంకా మిగిలి ఉన్న వారు మార్చి 14 వరకు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. అదేవిదంగా ఇప్పటివరకు జిల్లాలోని రెవెన్యూ డివిజన్ల వారీగా ఇప్పటివరకు సూర్యాపేటలో 24039, కోదాడ 11167, హుజూర్ నగర్ 12085 మొత్తం 47291 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. సూర్యాపేటలో 31 కేంద్రాలు, కోదాడ 22, హుజూర్ నగర్ 18 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండి అర్హట్స్ ఉన్నవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 24 న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురింప బడునని తెలిపారు. ఎం.ఎల్.సి. ఎన్నికల లో పోటీ అభ్యర్థులు ఖర్చు చేసే ధరల పట్టిక (రేట్ కార్డు) పై ఈ సందర్భంగా ఏమైనా సందేశాలు, సూచనలు ఉంటే పార్టీల ప్రతినిధులు అందించాలని అన్నారు. అదేవిదంగా ప్రతి మూడు నెలలకు ఒక్కసారి స్పెషల్ సమ్మరి నిర్వహిస్తాని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పు పై పార్టీల నాయకులు చర్చించారు. సమావేశలో కాంగ్రెస్ పార్టీ నుండి చకిలం రాజేశ్వర రావు, బి.ఆర్.ఎస్. నుండి కరుణాకర్, బి.జే.పి. అబిద్, సి.పి.ఎం. కోట గోపి, బి.ఎస్.పి. స్టాలిన్, వై.ఎస్.ఆర్. నుండి డి. రమేష్ , ఎన్నికల డి.టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాకు చెక్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా**



**కొత్తగూడెం, విశాలభారతి:** జిల్లాలో అక్రమ ఇసుక ఘనులు మరియు ఖనిజాల రవాణా పొరుగు రాష్ట్రాలు మరియు జిల్లాలో భారీ అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా యంత్రాంగం ఇసుక రవాణా జాయింట్ ఇన్స్పెక్షన్ పోలీస్ ఆర్టీవో మరియు మైనింగ్ శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరి నది మరియు దాని ఉపనదుల జిల్లాలోని వివిధ మండలాల గుండా వెళుతున్నాయి ఆ సమయంలో భారీ ఇసుకను నిలువలు మరియు ఇప్పుడు జిల్లాలో నాణ్యమైన ఇసుక ఖనిజాలు అందుబాటులో ఉన్నాయి అని భారీ మొత్తంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు జిల్లా దృష్టికి వచ్చిందని చెప్పారు. అలాగే పురుగు రాష్ట్ర ఇసుక వాహనాలు మన భూభాగాల గుండా ఎక్కువగా అర్ధరాత్రి వేళలో వెళ్తున్నట్లు సమాచారం అందింది అని వారు అన్నారు. వార్తా పత్రికలలో వార్తను ప్రతిరోజు కనిపించడం కు నిరంతరాయంగా సందేశాలు అందుకోవడం ఇలాంటి సమస్యల కారణంగా జిల్లా స్థాయి ఇసుక మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులు అందరితో ఏర్పాటు చేయడం జరిగింది నిర్వహించేందుకు చెక్ పోస్టు రెవెన్యూ పోలీస్ ఆర్టీవో మైనింగ్ శాఖలతో సంయుక్తానికి బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు జిల్లాలో ఇసుక తరలింపు పై గట్టుమీద పెట్టి అక్రమాలకు అడ్డుపడ్డ వేయాలి అన్నారు.

# పేకాటరాయుళ్లు అరెస్ట్

**రూ 35580నగదు, 7బైక్ లు, 6సెల్ ఫోన్లు స్వాధీనం**



**నల్లగొండ, విశాలభారతి:** జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలైన గంజా, జూదం, బెట్టింగ్,అక్రమ పిడిఎస్ రైస్ రవాణాలాంటి అసాంఘిక పనులకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా యస్.పి చందన దీప్తి ఐపీఎస్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. బుదవారం నాడు యస్.పి ఆదేశాల మేరకు తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానారెడ్డి కాలనీ గ్రామ శివారు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం తో జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం మరియు స్థానిక పోలీస్ సిబ్బంది సమన్వయంతో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 35580 రూపాయలు ఆరు సెల్ ఫోన్లు,7 బైక్ లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు .ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ ఎవరైనా జూదం,బెట్టింగులు, అక్రమ పీడీఎస్ రైస్ తరలింపు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని, జిల్లాలో టాస్క్ ఫోర్స్ బృందాలు ఎల్లప్పుడూ ఇలాంటి దాడులు నిర్వహిస్తునే ఉంటాయని అన్నారు. ఎవరైనా ఈలాంటి కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100 గానీ సంబంధిత పోలీస్ స్టేషన్ కి గానీ సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# తెలుగుశాఖ హెడ్ గా ప్రో,సాగి కమలాకర శర్మ.



**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలుగు భాషా, సాహిత్యాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులుగా ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ బాధ్యతలు స్వీకరించారు. మాజీ హెడ్ ప్రొ. సి. కాశీం బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ నూతన అధ్యక్షులు ప్రొ.సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకున్న తెలుగు శాఖకు అధ్యక్షున్ని కావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు, పరిశోధకులకు శాఖ తరపున అన్నివేళలా అందుబాటులో ఉంటూ వారి సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. చింతా గణేష్, ప్రొ. సూర్య ధనుంజయ్, డా. ఎస్ రఘు డా. వి జయలక్ష్మి, ఇమ్మిడిమహేందర్,కె.వెంకట్, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# యూజీసీ జాయింట్ సెక్రటరీ ప్రో.ఎన్. వెంకటేశ్వర్లు నియామకం.



**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల బిఓఎస్ సీనియర్ ప్రొపెసర్ ప్రో.ఎన్.వెంకటేశ్వర్లు యూజీసీ జాయింట్ నియమితులయ్యారు. గతంలా కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్, లా విభాగం హెడ్, శాతవాహన, మహాత్మాగాంధీ, ఓయూ యూనివర్సిటీ బి ఓ ఎస్ చైర్మన్ గా, లీగల్ మరియు ఎస్టేట్ సెల్ డైరెక్టర్, అడిషినల్ కంట్రోలర్ గా,పని చేసిన పాలమూరు యూనివర్సిటీ డీన్ గా పని చేస్తున్న సందర్భంలో అక్కడ న్యాయ కోర్సులు ప్రవేశ పెట్టడం కీలకమైన ప్రత్యేక పాత్ర పోషించారు. అయిన వద్ద 20 పీహెచ్డీ లు పూర్తి చేశారు. యూజీసీ రిసెర్చ్ అవార్డ్ తో పాటు ఓయూ వీసీ అవార్డ్ పొందారు. సౌత్ ఇండియాలో కార్పొరేట్ అండ్ సెక్యూరిటీస్ లా నైపుణ్యం కలిగిన ఉన్నారు. ప్రస్తుతం బషీర్ బాగ్ లా కళశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్నారు.ఓయూ వీసీ, రిజిస్ట్రార్ లకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఓయూ రావాల్సిన గ్రాంట్స్ మరియు ప్రాజెక్టు విషయం లో ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు.



# ప్రో.ముంద్రా ఆదినారాయణ ఆకస్మిక మృతి జెవివికి తీరని లోటు

**సికింద్రాబాద్, విశాలభారతి**: ఓయూ రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొపెసర్, మాజీ జెవివి రాష్ట్ర అధ్యక్షుడు ప్రో. ముంద్రా. ఆదినారాయణ (73), ఆదివారం తెల్లవారుజామున జామున మృతి చెందారు. బుధవారం హబ్సిగుడ కిన్నెర గ్రాండ్ హోటల్ లో అయిన కుటుంబ సభ్యులు, జెవివి, మిత్రులు సంతాప సభ ఏర్పాటు చేశారు. ఇటీవలే చెకుముఖి సంబురాల్లో చురుగ్గా పాల్గొన్న అయిన ఆకస్మిక మృతి అటు సైన్స్ వికాసానికి ఇటు జెవివికి తీరని పూడ్చలేని లోటు అన్నారు. చివరి సమయం కూడా జెవివి చెకుముఖి కార్యక్రమంలో పాల్గొని ఇలా మృతి చెందడం ఇప్పటికి నమ్మలేకపోతున్నామన్నారు. కొన్ని విషయాల్లో రాజిపడే వారు కాదని, గత కొన్ని సంవత్సరాలుగా జెవివి అభివృద్ధిలో ఒక సాధారణ కార్యకర్తగా బాధ్యతలు నిర్వహించారని పలువురు అయిన సేవాలు కొనియాడారు. సూర్యాపేట జిల్లా ,కోదాడ నియోజకవర్గ పరిధిలోని నల్లబండ గూడెం గ్రామానికి చెందిన ప్రో.ఆదినారాయణ ఓయూ కెమిస్ట్రీ విభాగం లో ప్రొపెసర్ గా పనిచేశారని అయిన సేవాలు గుర్తు చేసుకుంటూ, అయిన తో గడిపిన క్షణలు నెమర వేసుకొన్నారు. అయిన కుమారుడు అశోక్ మాట్లాడుతూ తన తండ్రి కొన్ని విషయల్లో రాజీపడే స్వభావం లేదని ,జెవివికి తన తోడ్పాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో
మాజీ హుజూర్ నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి
రాష్ట్ర జెవివి ప్రో.కోయ వెంకటేశ్వర్ రావు, రావుల వర ప్రసాద్, ప్రో.బి.ఎన్ రెడ్డి, డా.అందే సత్యం, ప్రో. అరబండి.ప్రసాద్ రావు, ప్రో.ఎన్.రామ చంద్రయ్య, ప్రో.బాను ప్రకాష్, రాజా, లింగస్వామి, మోహన్, శ్యామల్ రావు,విద్యాసాగర్ రావు, డా.నాగేశ్వరరావు,ఔట అధ్యక్షుడు ప్రో.మనోహర్, డా.గంగాధర్, మాణిక్యల రావు, కుమారుడు యం.అశోక్, కోడలు యం.వనజ, బామర్ధి శ్రీరాం మూర్తి, అనూప్, బంధు మిత్రులు పాల్గొన్నారు.




మల్లాపూర్ డివిజన్ పిట్టల బస్తి లో ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి డ్రైనేజ్ పైప్ లైన్ పనులను ప్రారంబించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంబందిత జిహెచ్ఎంసీ అధికారులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ, సీలింగ్ భూముల గూగుల్ మ్యాప్ రెడీ చేయండి

■ జిల్లా కలెక్టర్ గౌతమ్



**విశాలభారతి,మేడ్చల్ :** ప్రభుత్వ భూములు,సీలింగ్ భూములు అన్నిటిని గుర్తించి గూగుల్ మ్యాప్ తయారు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రోజున విసి మీటింగ్ హాల్లో ఆర్డీవోలు, ఎమ్మార్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో ఉన్న సీలింగ్ భూములు అన్నింటిని ధరణిలో క్రయవిక్రయాలు జరగకుండా చూడాలన్నారు. కోర్టుకేసులు పెండింగ్ లో ఉన్నా వాటిని కౌంటర్ ఫైల్ చేయమని తహశీల్దార్లకు ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ ల్యాండ్ లను కాపాడవలసిందిగా కలెక్టర్ కోరారు.ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల యొక్క గూగుల్ మ్యాప్ ను తయారు చేయాలని సంబంధిత అధికారులను కోరారు.ఓ ఆర్ ఆర్ చుట్టూ ఇండస్ట్రియల్ పార్కు స్థాపించడానికి గవర్నమెంట్ పార్సిల్ గుర్తించమన్నారు.మండల పరిధిలోని పెండింగ్ లో ఉన్న టీఎస్ బి పాస్ దరఖాస్తులను పరిశీలించి పంపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,ఆర్డీవో శ్యాంప్రకాష్,మండల తహశీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ కృషి ఎనలేనిది

■ ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



**బాల్కొండ, విశాల భారతి:** అడవి బిడ్డలను సన్మార్గంలో నడిపించడానికి, వారికి నాగరికత నేర్పడానికి సేవాలాల్ మహరాజ్ చేసిన కృషి ఎనలేనిదని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ కేంద్రంలో ని బంజారా భవన్ లో అధికారికంగా జరిపిన బంజారుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ బంజారా బిడ్డలకు హిందుదైవం గొప్పతనాన్ని తెలియజేసిన మహానుభావుడు అని తెలిపారు. గత ప్రభుత్వంలో సేవాలాల్ మహరాజ్ జయంతి అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకొంటే ఈ ప్రభుత్వం దానిని కొనసాగిస్తూనే ఆయన జయంతి రోజు ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించడం అభినందనీయం అని అన్నారు. కేసీఆర్ సహకారం తో నియోజకవర్గంలో 50 లక్షలతో ఎక్కడ లేనట్టుగా భీమ్‌గల్ లో బంజారా భవన్ నిర్మించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అధికారి నాగారావు, జెడ్పీటీసీ రవి, కన్నె సురేందర్, బంజారా నాయకులు, శర్మ నాయక్, తుక్కజి,లింగం,తిరుపతి,నరేష్,గిరిజన సర్పంచ్ ,ఎంపిటిసి లు ఎమ్మార్వో లు, ఎంపీడీఓ లు, తండాల పెద్ద మనుషులు తదితరులు పాల్గొన్నారు.

# కామన్ ఆర్చ్ ను ప్రారంభించిన కౌన్సలర్ వెంకట్ రెడ్డి.




**విశాల భారతి,నాగారం:** ఈస్ట్ గాంధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మ వారి దేవస్థానం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కామన్ ఆర్చ్ ని రిబ్బన్ కట్ చేసి స్థానిక కౌన్సలర్ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సలర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు మూడున్నర లక్షల వ్యయంతో ముఖ్య రహదారుల నుండి కాలనీలోని పోచమ్మ గుడికి వెళ్ళే రోడ్ నెంబర్ 6 మరియు రోడ్ నెంబర్ 9 ఎంట్రన్స్ లలో నిర్మించిన ఈ కమాన్ ఆర్చ్ ను మరియు కాలనీ రోడ్లకు అమర్చిన రోడ్ నెంబర్ సైన్ బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ గౌర అక్క,సత్యం సాగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. కిష్టారెడ్డి,జనరల్ సెక్రటరీ వంకోజు శ్రావణ్ కుమార్,రాపోల్ ప్రవీణ్,అడ్వైసర్ మూర్తి,హన్మంతు రెడ్డి,డేవిడ్ రాజు,కమిటీ సభ్యులు లింగారెడ్డి,జస్వంత్ సింగ్,కె వెంకటరమణ,రాజిరెడ్డి,వినోద్,బాలమల్లేష్,భూపతిరెడ్డి, ఖాజా,నరేష్ గౌడ్,సుదర్శన్,వి.మల్లేష్ గౌడ్నర్సింగ్ రావు మరియు పలువురు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం

■ మున్సిపల్ చైర్మన్ చంద్రరెడ్డి

**విశాలభారతి,నాగారం:** నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు ఎస్వి నగర్ కాలనీలో నివసించే కొక్కొండ ఆగి రెడ్డి బంధువులకు బుధవారం చికిత్స నిమిత్తం ఎల్ ఓ సి లెటర్ మున్సిపల్ చైర్మన్ చంద్ర రెడ్డి అందజేశారు.
వెరికోస్ వేన్స్ వ్యాదితో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలిసి స్థానిక కౌన్సిలర్ కోమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి.మేడ్చెల్ నియోజకవర్గం శాసన సభ్యులు చామకురా మల్లారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన 90000 రూపాయల ఎల్ ఓ సి లెటర్ ఇచ్చారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చంద్ర రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధ పడుతున్న ఎందరో రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిది ఒక వరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకుడు కోమిరెల్లి సుధాకర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ను కలిసిన జర్నలిస్టులు

■ ఎంవిఐ వివేకానంద్ రెడ్డికి సన్మానం

**ఆర్మూర్, విశాల భారతి:** ఆర్మూర్ పట్టణానికి నూతనంగా వచ్చిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. వివేకానంద్ రెడ్డిని బుధవారం జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వివేకానంద్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, టూ వీలర్ నడిపే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ను ధరించి వాహనాలు నడిపించవలెనని అన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో తాము పని చేస్తామనీ, తనిఖీలతో పాటు ప్రజలకు అవగాహనసదస్సును కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆర్టీఐ సొంత భవనం లేకపోవడం బాధాకరమని త్వరలో సొంత భవన నిర్మాణకై అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా సొంత భవనం నిర్మాణాన్ని పూర్తి చేసేలా చూస్తానని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో జర్నలిస్టులో సుంకరి గంగా మోహన్, ముఖేష్,లిక్కి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



# నూతన ఎంపిడిఓ కు సన్మానం

**ఆర్మూర్, విశాల భారతి:** నందిపేట్ మండల పరిషత్ కు బదిలీపై వచ్చి ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రావును మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ ఖలీం హైమద్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు సన్మానించారు. ఎంపీడీవోగా ప్రజలకు నిరంతరం సేవలు అందించి అందుబాటులో ఉండాలని కోరారు. అదే విధంగా వక్స్ బోర్డ్ నుండి మసీదుల అభివృద్ధి కోసం మంజూరైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ ఖలీమ్ మాట్లాడుతూ మండలంలోని ఇతర మసీదులకు కూడా అతి త్వరలో చెక్కులు పంపిణీ చేస్తాం అని మైనార్టీలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ హైమద్, జమే మజీద్ అధ్యక్షులు షేక్ జవీద్, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఈక్విటీ గ్రాంట్ ని సద్వినియోగం చేసుకోవాలి

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో బుధవారం రైతు సంఘం, ఎన్సీడీసీ, ఎఫ్.పి.ఓ. (F.P.O.) ఆఫీసుకు హెడ్ ఆఫీస్ నుండి ఎన్సీడీసీ ఆర్.డి (RD) వంశీకృష్ణ సి. ఎ. (C.A.) గౌస్, బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ పాటిల్ రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ డి వంశీకృష్ణ మాట్లాడుతూ.. రైతులందరూ ముఖ్యంగా సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చే ఈక్విటీ గ్రాంట్ ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వెరైటీ సీడ్ ఉత్పత్తిని ఇక్కడ రైతులు ఉత్పత్తి చేసి ధర్పల్లి మండలనికే ప్రత్యేక పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జిర్ర మైపాల్ యాదవ్, సి.ఓ. సుజాత, డైరెక్టర్స్ మోహన్ రెడ్డి, శేఖర్ రెడ్డి లోకేష్ రెడ్డి , మిట్టపల్లి వెంకట్ ,కొట్టాల గంగారెడ్డి, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎలక్ట్రిక్ షాపును ప్రారంభించిన నాతరి స్వామి

**మంచిర్యాల, విశాల భారతి:** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం ఎం ఆర్ ఓ ఆఫీస్ ఎదురుగా ఎస్ ఆర్ ఎలక్ట్రికల్స్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరీ స్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళిదర్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం భవిష్యత్తులో తాండూర్ మండల్ లో ఎస్ ఆర్ ఎలక్ట్రికల్ మంచి సక్సెస్ కావాలని యాజమాన్యానికి సుజిత్, రాకేష్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఇసా, ఎంపీటీసీ సిరంగి శంకర్ , సింగిల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి ,తాండూర్ మండల్ సోషల్ మీడియా కో'ఆర్డినేటర్ సాంబయ్య సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్ మీడియా మిత్రులు దాసరి శ్రీనివాస్ సాలింగం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

■ మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

**కూకట్ పల్లి,విశాలభారతి :** వాటర్ వర్క్స్ బోర్డ్ జనరల్ మేనేజర్ ప్రభాకర్ ను వారి కార్యాలయంలో బుదవారం మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు కలిసి బాలాజీనగర్ డివిజన్ కు సంబంధించి మంజూరై పెండింగ్ లో ఉన్న వాటర్ వర్క్స్ పనులు వేసవి కాల దృష్ట్యా త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మేనేజర్ తో చర్చించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆయనను ఆయనను కోరారు. అందుకు ఆయన స్పందిస్తూ పనులు త్వరతి గతిన పూర్తిచేస్తామని హామీఇచ్చారు.




# కళాశాల ఫేర్ వెల్ వేడుకకు ముఖ్య అతిధిగా రత్నం ప్రదీప్

**మంచిర్యాల, విశాల భారతి:** విద్యార్థులు పలు సూచనలు పాటించి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని.. విద్యని నిర్లక్ష్యం చేయవద్దని కాసిపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అన్నారు. గొప్ప గొప్ప ఉద్యోగాలను సాధించి తల్లి తండ్రులకు, గురువులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలుపుతూ వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. అనంతరం కలశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మండల అధ్యక్షులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ విప్ కు ఎమ్మెల్యే పరామర్శ

**మంచిర్యాల విశాల భారతి:** రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పరామర్శించారు. హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మన్ కుమార్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రజలకు సేవ చేసే అవకాశం మనకు ఇచ్చారని దానిని మనము కాపాడుకొని మళ్ళీ ప్రజాసేవలో ఉండాలని వారు అన్నారు.

# రూ.1.15 లక్షల ఎల్ఓసి మంజూరు



**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండల కేంద్రానికి చెందిన చిన్న గంగారం అనారోగ్యంతో బాధపడుతూ హైదారాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. చికిత్స కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుండడంతో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ని సంప్రదించారు. వెంటనే ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.1లక్ష 15 వేల ఎల్ ఓసిని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ముత్యాల సునీల్ కుమార్ కి ధన్యవాదాలు తెలిపారు.



# కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులు ప్రారంభం

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**కూకట్ పల్లి విశాలభారతి:** మూసాపేట్ సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు ప్రణాళి కాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నట్లు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తెలిపారు. బుధవారం రూ. 20 లక్షలతో సమతానగర్ లో కమ్యూనిటీ హాల్ రెండవ అంతస్తు స్లాబ్ పనులను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేకమైన దృష్టితో ఫతేనగర్ డివిజన్ కు అధిక నిధులు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఫతేనగర్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యం వంటి పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలలో బస్తీ నాయకులు, అసోసియేషన్ సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజేందర్, జనరల్ ప్రధాన కార్యదర్శి నరసింహా, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



# సిసి రోడ్డు పనులు ప్రారంభం

- కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ చంద్ర రెడ్డి

**విశాలభారతి,నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులోని సింహపురి కాలనీలో సిసి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్ట మున్సిపల్ చైర్మన్ చంద్ర రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 6.40 లక్షలతో సి సి రోడ్డును నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టడం జరిగిందన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో విడతల వారీగా అభివృద్ధి ధ్యేయంగా పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొట్టే దివ్య దయాకర్ రావు,మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.

- డిటెక్టివ్ సీఐ నాగరాజు

**శంకర్‌పల్లి, విశాలభారతి:** సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని డిటెక్టివ్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి గణేష్ నగర్ కాలనీలో నక్షత్ర యూత్ అసోసియేషన్ సభ్యులతో సిఐ సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల వీడియో కాల్స్ కు స్పందించరాదని, పండుగలకు షాపింగ్ చేసే సమయంలో ఇచ్చే లాటరీ కూపన్లకు వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదన్నారు. సైబర్ నేరగాళ్లు చెప్పే మోసపూరిత మాటలను నమ్మరాదని, సైబర్ నేరాలకు గురైతే 1930కి ఫోన్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్లు పంపే లింక్లను క్లిక్ చేయరాదని, సందేశాలకు స్పందిచరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నీటిపన్ను వేస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే లాస్యనందిత
- బోర్డు సీఈఓను కలిసిన ఎమ్మెల్యే



**విశాలాభారతి,సికింద్రాబాద్ కంటోన్మెంట్:** నీటిపన్ను పై స్థానిక ఎమ్మెల్యే లాస్య నందిత అభ్యంతరం వ్యక్తం చేశారు.నీటిపన్ను వేస్తే సహించేది లేదని వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై భారం వేసే ఏ నిర్ణయాన్ని కూడా ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నివసిస్తున్న ప్రజలపై నీటి పన్ను విధించాలన్న నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. బోరు నీటికి మీటర్లు పెట్టి పన్ను వసూలు చేయడం సరికాదని సీఈఓ మధుకర్ నాయక్ కు వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే లాస్యనందితతో పాటు బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, బీఆర్ఎస్ నేతలు సాయి కిరణ్, కిరణ్, సతీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.





# అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ అవగాహన

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్ సి యు ఆచార్య హాజరైయ్యారు. అవగాహన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె అనంత్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆచార్య వారిజారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీతి, నిజాయితీ, మంచి నడవడిక నేర్పేది మాతృభాషని, తల్లి భాషలేనిదే మానవజాతికి వికాసం లేదన్నారు.అన్య భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికి మాతృభాషలో ప్రావీణ్యుడు కాలేని వాడు విజ్ఞాన సముపార్జన చేయలేడని. అలాంటి తల్లి భాష నేడు తల్లడిల్లుతుందన్నారు.ప్రపంచ వ్యాప్తంగా వేలకొలది మాతృభాషలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయంటూ యునెస్కో హెచ్చరిస్తుందని ఆమె గుర్తు చేశారు.ఆంగ్ల భాష అనే రోడ్ రోలర్ క్రింద పడి ఇప్పటికే మాతృభాషలెన్నో నలిగి కనుమరుగై పోయాయని యునెస్కో సర్వే తేల్చింది. మాతృభాషలను పరిరక్షించుకోవడానికి యునెస్కో వారు 1999 ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించి ప్రతి సంవత్సరం ఒక నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం నినాదం 'బహుభాషా విద్య అనేది తరతరాల అభ్యాసానికి మూలస్తంభం'. ప్రపంచ వ్యాప్తంగా వేల స్థానిక భాషలు ఉన్నా, కొన్ని వందల భాషలకే విద్యా వ్యవస్థలో చోటు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నాగలక్ష్మి,పుష్పలీల,స్వాతి,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, పాలం శ్రీను, జనార్ధన్,శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# హయత్ నగర్ ఇన్స్పెక్టర్గా రామకృష్ణ

- క్రైమ్ ఇన్స్పెక్టర్గా రుద్వీర్ కుమార్




**ఎల్బీనగర్ విశాలభారతి :** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్లో ఉన్న హయత్ నగర్ పోలీస్ స్టేషన్కు నూతన ఇన్స్పెక్టర్గా 2004 బ్యాచ్కు చెందిన జీ.రామకృష్ణ ఎల్బీ నగర్ సీసీఎస్ నుంచి బదిలీ పై వచ్చారు. సోమవారం రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గతంలో హయత్నగర్కు ఇన్స్పెక్టర్గా పని చేసిన వెంకటేశ్వర్లు మహేశ్వరానికి గత నెల 30న బదిలీపై వెళ్లారు. క్రైమ్ ఇన్స్పెక్టర్గా ఉన్న నిరంజన్ మల్కాజిగిరికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రుద్వీర్ కుమార్ వచ్చారు.



# కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారిల సంక్షేమానికి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం కోహెడ వార్డు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమషనర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సఫాయి కర్మచారిలు విధులు నిర్వహించేటప్పుడు తప్పకుండా రక్షక పరికరాలు ధరించాలన్నారు. మురికి కాల్వలు శుభ్రపరిచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికులు కేంద్ర ప్రభుత్వానికి అనుబంధమైన నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ పరిధిలోని పథకాలు, సబ్సిడీలు పొంది తమ కుటుంబం ఆర్థికంగా బలపడాలన్నారు. సమాజంలో సఫాయి కర్మచారీల సేవలు వెలకట్టలేనివన్నారు. వారికి రావాల్సిన అన్ని సదుపాయాలు, హక్కులను కాపాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ హరీష్, మున్సిపాలిటీ సిబ్బంది భానుమతి, రోజా, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విచారణ జరిపించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు



**మోతె, విశాలభారతి:** సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్ విద్యార్థి ఇరుగు అస్మిత మృతి పై సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని బురకచర్ల గ్రామంలో ఇరుగు అస్మిత కుటుంబ సభ్యులను సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరుగు అస్మిత మరణించటం చాలా బాధాకరమనీ, ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో వైష్ణవి అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈ విద్యార్థినిల మరణాలపై రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్పందించకపోవడం విచారకరమని,విద్యార్థిని మరణాల పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల విద్యార్థినుల మరణాలపై సమగ్ర విచారణ జరిపి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు కక్కిరేణి సత్యనారాయణ, కొండ రాములు, నాగం మల్లయ్య, మహిళా సంఘం నాయకురాలు మట్టిపల్లి నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య..

**శంకర్‌పల్లి, విశాలభారతి:** కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మహారాజ్ పేట గ్రామానికి చెందిన మోతె రాములు (36) గత నాలుగు నెలలు నుండి కడుపు నొప్పితో బాధ పడుతూ ఇంట్లోనే ఉంటున్నాడని, ఆరోగ్య సమస్యలతో బాధపడేవాడని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై కోటేశ్వరరావు ఉన్నారు.

# బీజేపీ బలోపేతానికి కృషి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తెలంగాణలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని ఆ పార్టీ ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ట్రెజరర్ గా రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన సేవలు గుర్తించి రాష్ట్ర బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటికి చెందిన తనకు రాష్ట్ర స్థాయిలో పదవి రావడం గర్వకారణం అన్నారు. ఎస్సీ మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేసినట్టు తెలిపారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ఎస్సీ మోర్చా కోశాధికారిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర స్థాయి పదవి రావడానికి కారణమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర క్రమశిక్షణ క్షమిటి సభ్యులు బోసుపల్లి ప్రతాప్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహా రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.



# త్రీడీ,బ్లూ ప్రింట్ సాయంతో షోల్డర్ కీలు మార్పిడి

**విశాలభారతి, సికింద్రబాద్ కంటోన్మెంట్:** సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వైద్య సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. శస్త్ర చికిత్సలకు ముందే అన్ని ఏర్పాట్లు చేసుకుని అత్యంత తక్కువ సమయంలో ఆపరేషన్స్ విజయవంతం చేస్తున్నారు. ఓపేన్ హార్ట్ సర్జరీ చేయాలంటే సుమార్ ఆరు గంటల సమయం అవసరం కానీ త్రీడీ, బ్లీ ప్రింట్ టెక్నాలజీతో కేవలం మూడు గంటల్లో నే పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకు మోకీళ్ల మార్పిడి చేయడం చాలా సులువు కానీ షోల్డర్ కీలు కూడా మార్పిడి ని విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు కిమ్స్ షన్ సైన్ ఆసుపత్రి వైద్యలు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బ్లూ ప్రింట్ సాయం తో రోగికి కావల్సిన కీలు సైజ్ ను గుర్తించి త్రీడీ సాయం తో కీలు రూపొందించిన తర్వాతా రోగిని ఆపరేషన్ చేస్తున్నారు. ఇటుంటి శస్త్ర చికిత్సలు ఇప్పటికే వందల సంఖ్యలో పూర్తి చేయగా తెలుగు రాష్ట్రాల్లో 100 మంది ఆర్థోపెటిక్ వైద్యులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. రివర్స్ కీలు మార్పిడి కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ శిక్షణా తరగతులకు ప్యారీస్ కు చెందికి ప్రఖ్యాత వైద్యులు సర్జన్ డాక్టర్ జీన్ గిమ్బోర్గ్ ముఖ్యఅతిగా హాజరయ్యారు. శస్త్ర చికిత్స విజయవంతం గా పూర్తి చేసుకున్న తర్వాత రోగులు మూడు నెలల్లోనే తమ ఫనులు తాము చేసుకునే అవకాశం ఉంది, 6 నెల్లో పూర్తి స్థాయిలో రికరి కానున్నారు. ఈ శస్త్ర చేయించుకున్న వారిలో అతి చిన్న వయస్సు 35 ఏల్లు కాగా అత్యధిక వయస్సు 85 ఏల్లని వివరించారు..అవగాహన లేమితో షోల్డర్ సమస్యలను పట్టించుకోవడం లేదని, అలసత్వం చూపడం తోనే రిప్లేస్ చేసే స్థాయికి చేరుతున్నాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ గురవారెడ్డి, డాక్టర్ అనూప్ కుమార్, డాక్టర జీన్ గిమ్బోర్గ్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మీడియా పాత్ర కీలకం.

- ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణలో వజ్రెష్ యాదవ్.

**మేడిపల్లి,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే మీడియా...ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా తమ విలువైన సూచనలు అందజేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు.బుదవారం బుద్ధా నగర్ లోని మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ తోటకూర వజ్రెష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిపల్లి మండలంలో ప్రతీ ఒక్క జర్నలిస్టుకు కనీస వసతులు కల్పిస్తూ ప్రభుత్వం నుంచి అందించే ప్రతీ ఒక్క సంక్షేమ పథకం అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మూడు చింతలపల్లి వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి,బి బ్లాక్ ప్రధాన కరదర్శి కొత్త కిషోర్ గౌడ్,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్,పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి,కార్పొరేటర్లు చందర్ గౌడ్,సుమన్ నాయక్,బింగి జంగయ్య యాదవ్,రసాల వెంకటేష్ యాదవ్, గుర్రాల వెంకటేష్ యాదవ్, పులకండ్లజంగా రెడ్డి,కీసర మండల్ ప్రధాన కరదర్శి రామిడి విజయ్ రెడ్డి,కీసర మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ రామ్ రెడ్డి,వెంకటేష్ యాదవ్,లోకేష్, రామ్ చందర్ యాదవ్,మేడ్చల్ జిల్లా టి.యు.డబ్ల్యూ.జే(ఐజెయు)అధ్యక్షుడు బాలరాజు,మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్లయ్య,శ్రీదర్ రెడ్డి,ప్రెస్ క్లబ్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు

